

100 శాతం సబ్సిడీ

పశుగ్రాసం సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం 7





బాలసముద్రంలో ఆకుకూరల పంపిణీ

అంగన్‌వాడీల ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సక్షం (స్టిములేటింగ్ అడ్వాన్స్‌డ్ నాలెడ్జ్ ఫర్ సస్టెయినబుల్ హెల్త్ మేనేజ్‌మెంట్) కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది. చిన్నారులు, గర్భవతులు, బాలింతలకు పురుగు మందులు, రసాయన ఎరువులు వినియోగించని తాజా ఆకుకూరలు, కూరగాయలతో వండిన భోజనం పెడుతున్నారు. గర్భవతులు, బాలింతలకు అంగన్‌వాడీల వద్దే పండించిన ఆకుకూరలు, కూరగాయలను పంపిణీ చేస్తు న్నారు. దీంతో సర్వత్రా హర్షం వ్యక్తమవు తోంది. అంగన్‌వాడీలు గతంలో అందిస్తున్న సేవలే కాకుండా సక్షం పథకం కింద బాల్యాన్ని మరింత వికసింపజేసేందుకు, మానసిక, భౌతిక, సామాజికపరమైన సమగ్ర ఎదుగుదలకు పునాది వేసే దిశగా చర్యలు చేపడుతున్నారు.



బాలసముద్రంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సాగు చేసిన ఆకుకూరలు, కూరగాయ పంటలను పరిశీలిస్తున్న సీడీపీఓ, సూపర్‌వైజర్

సక్షం.. స్వచ్ఛం..

ఫలితాలనిస్తున్న పథకం

- అంగన్‌వాడీల్లో ఆకుకూరలు, కూరగాయ పంటలు
- వాటితోనే వంట
- గర్భిణులు, బాలింతలకు పంపిణీ
- రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా సాగు



ఆనందం వ్యక్తంచేస్తున్న గర్భవతులు, బాలింతలు, అధికారులు

తనకల్లు, జనవరి29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సక్షం కార్యక్రమం అమలు చేస్తున్నారు. ఇందులో ముఖ్యం గా గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు పురుగు మందులు, రసాయన ఎరువులు ఉపయోగించని అంగన్‌వాడీ కేంద్రాల్లో పండించిన ఆకుకూరలు, కాయగూరలతో వండిన ఆహారాన్ని అందించడం లాంటి కార్యక్రమాలను ఎంపిక చేసిన కేంద్రాల్లో చేపడుతున్నారు. ఇందులో భాగంగా నల్లచెరువు ప్రాజెక్టు పరిధిలోని తనకల్లు, నల్లచెరువు, గాండ్లపెంట మండలాల్లోని 24 కేంద్రాల్లో కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. తనకల్లు మండలంలోని గందోడివారిపల్లి, కొక్కం టి సెక్టారులో 8, గాండ్లపెంటలో 6, తనకల్లు, నల్లచెరువు మండలాల్లోని 5 కేంద్రాల్లో కార్యక్రమం అమలు చేస్తున్నారు. తద్వారా తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణ, బాలల శరీరక, మానసిక ఎదుగుదలకు కృషి చేస్తున్నారు. గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు పురుగుమందులు, రసాయన ఎరువులు ఉపయోగించకుండా పండించిన ఆకుకూరలు, కూరగాయలను పంపిణీ చేస్తున్నారు. రక్తహీనత నివారణ, పోషక విలువలు పెంపొందించడం, గర్భవతులు, బాలింతలకు వచ్చే రుగ్మతులను ఎదుర్కొనేందుకు ఉపయోగపడేలా చర్యలు చేపడుతున్నారు. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నియంత్రించి, వయసుకు తగిన విధంగా ఎత్తు, బరువుతోపాటు పరిజ్ఞానం పెంపొందించేలా చర్యలు చేపట్టారు. ఈ పథకం అమలుచేస్తున్న కేంద్రాల పరిధిలో బాలింతలు, గర్భవతులు, చిన్నారులకు స్వచ్ఛమైన ఆకుకూరలు, కూరగాయలను అదించడంతో వారు కేంద్రాల పట్ల ఆకర్షితుల వుతున్నారు. ఇలాంటి పథ కాలను ఎంపిక చేసిన కేంద్రాల్లోనే కాకుండా అన్నిచోట్లా అమలు చేయాలన్న వాదనలు వినిపిస్తున్నాయి. సక్షం కింద ఎంపిక చేసిన కేంద్రాల పట్ల సూపర్‌వైజర్లు, ఉన్నతాధికారులు శ్రద్ధ వహించడంతో పథకం విజయవంతమైంది. తనకల్లు మండలంలోని పెద్దపల్లి, మల్లిరెడ్డిపల్లి, బాలసముద్రం, కోటపల్లి, రతినేనాయక్ తండా, గందోడివారిపల్లి, ఎర్రగుట్టపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్షం కార్యక్రమం అమలు చేస్తున్నారు. తద్వారా పండించిన ఆకుకూరలు, కాయగూరలను గర్భవతులు, బాలింతలకు పంపిణీ చేస్తున్నారు.



ఆనందంగా ఉంది

మా పిల్లలు అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్నారు. గతంలో వారానికి ఒకసారి కూరగాయలు తెచ్చి వంట వండి వడ్డించేవారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల వద్దనే కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. పురుగుమందులు, రసాయన ఎరువులు వినియోగించట్లేదు. దీంతో రోజూ చిన్నారులకు తాజాగా ఉండే ఆకుకూరలు, కూరగాయాలను తెచ్చి వండడం ఎంతో బాగుంది. - భాగ్యమ్మ, కోటపల్లి, తనకల్లు మండలం

కొనసాగించాలి

అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పురుగుమందులు, రసాయన ఎరువులు వాడకుండా ఆకుకూరలు, కూరగాయలు పడించి, పంపిణీ చేయడం మంచిది. ఈ కార్యక్రమం ద్వారా బాలింతలు, గర్భవతులకు పోషకాహారం అందుతుంది. దీనిని కొనసాగించాలి. - శ్రావణి, బాలింత, బాలసముద్రం, తనకల్లు





ఆకుకూరలు పంపిణీ చేయడం ఆనందం


మారుమూల గ్రామాల్లో పండించే తాజా కూరగాయలు, ఆకుకూరలు లభించడం కష్టంగా మారింది. పురుగుమందులు, రసాయన ఎరువులు ఉపయోగించకుండా ఆకుకూరలు పండించడం ప్రస్తుత పరిస్థితుల్లో అసాధ్యమనే చెప్పాలి. ఈ సమయంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో రసాయన ఎరువులు, పురుగుమందులు ఉపయోగించకుండా పండించిన కూరగాయ లు, ఆకుకూరలను గర్భవతులు, బాలింతలకు అందించడం చాలా బాగుంది. - శిరీష, గర్భిణి, రతినేనాయక్ తండా

పైలెట్ ప్రాజెక్టు విజయవంతం

తనకల్లు, నల్లచెరువు, గాండ్లపెంట మండలాల్లోని 24 అంగన్‌వాడీ కేంద్రాలు సక్షం కార్యక్రమానికి ఎంపికయ్యాయి వీటిలో 22 కేంద్రాల్లో ఇప్పటికే గర్భవతులు, బాలింతలకు ఆకుకూరల పంపిణీ చేపట్టాం. ఏడాది పొడవునా తాజా ఆకుకూరలు, కూరగాయలు అందించేలా ప్రణాళికలు రూపొందించి, అమలు చేస్తున్నాం. బాలసముద్రం గ్రామంలో బుధవారం గర్భవతులు, బాలింతలకు ఆకుకూరల పంపిణీ చేపట్టాం.

- గంగరత్న, సీడీపీఓ, నల్లచెరువు ప్రాజెక్టు

కంపచెట్లలో కార్యాలయం



ఫొటో చూసి.. ఇదేదో దట్టమైన అడవి అనుకుంటే తప్పులో కాలేసినట్లే. ఇది అరణ్యం కానేకాదు. కార్యాలయ భవనం. అర్ధంతరంగా ఆగిపోయిన గుడిబండ మండలంలోని ముతుకూరు గ్రామ పంచాయతీ సచివాలయ భవనం. గత వైసీపీ హయాంలో భవన నిర్మాణం చేపట్టారు. పనులు పునాదులను దాటలేదు. ఏళ్లు గడుస్తున్నాయి. పునాదులపై మొక్కలు మొలిచి, పెద్ద చెట్లుగా పెరిగాయి. వైసీపీ పాలకుల నిర్లక్ష్యానికి పరాకాష్ట ఈ భవన నిర్మాణం.

- గుడిబండ, ఆంధ్రజ్యోతి

భక్తిగీతాల ఆలాపన



పుట్టపర్తి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): విద్యాసంవత్సరం ముగింపు సందర్భంగా ఈశ్వరమ్మ పాఠశాల విద్యార్థులు భక్తిగీతాలాపనతో అలరించారు. స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో బుధవారం సాయంత్రం 10, 12 తరగతుల విద్యార్థులు సత్యసాయి ప్రేమతత్వంపై భక్తిగీతాలను ఆలపించారు. గంటపాటు మధుర గాన కచేరీ నిర్వహించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



పల్లె నిద్రలు చేపట్టండి

కేసుల దర్యాప్తు వేగవంతం చేయండి.. ఎస్పీ రత్న ఆదేశాలు

పుట్టపర్తిరూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారులు, సిబ్బంది పల్లె నిద్రలు చేపట్టి అసాంఘిక కార్యకలాపాలు, శాంతిభద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ రత్న ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ) నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐతో జిల్లాలో ముఖ్యమైన కేసులపై సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. రోజూ సాయంత్రం వేళల్లో ముమ్మర వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. గ్రామాలను సందర్శించి, అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుని, నేరాల కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రోడ్డుప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్‌బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు, సైబర్‌సెల్ సీఐ తిమ్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగం పేరుతో రూ.23 లక్షలకు బురిడీ 6

అదిరే.. అప్సర..

సినీ హీరోయిన్ అప్సరా రాణి అనంతలో బుధవారం సందడి చేశారు. రాచరికం సినిమా ప్రమోషన్ కోసం ఆమె చిత్ర బృందంతో కలిసి వచ్చారు. అనంతకు ఎప్పటి నుంచో రావాలని ఉందని, ఇప్పుడు ఆ కోరిక తీరిందని అన్నారు.

- అనంతపురం కల్చరల్, ఆంధ్రజ్యోతి

నీరున్నా... తప్పని తిప్పలు..!

- పాలినేని వారిపల్లిలో రెండు నెలలుగా సమస్య
- మరమ్మతులకు నోచుకోని పంచాయతీ బోరు మోటారు
- పొలంబాట పట్టిన జనం



వ్యవసాయ బోరు బావి వద్ద నీటిని పట్టుకుంటున్న పాలినేనివారిపల్లి వాసులు

ఓబుళదేవర చెరువు, జనవరి29(ఆంధ్ర జ్యోతి): పంచాయతీ బోర్లలో నీరు పుష్కలంగా ఉన్నా.. ప్రజలకు మాత్రం తిప్పలు తప్పట్లేదు. అధికారుల నిర్లక్ష్యం మూలంగా నీటి కోసం నిత్యం పొలాల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. మండలంలోని పాలినేనివారిపల్లిలో పంచాయతీ బోరు మోటారు మరమ్మతులకు లోనై రెండు నెలలు దాటినా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో నీటి సమస్య తలెత్తింది.



పొలం నుంచి నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్థులు

రోజూ పొలంబాట

గ్రామంలో మూడు ప్రభుత్వ తాగునీటి పథకం బోర్లున్నారు. మూడింటిలోనూ నీరు పుష్కలంగా ఉంది. ఒక బోరుకు మోటారు బిగించి, గ్రామానికి నీరు సరఫరా చేస్తున్నారు. ఆ మోటారు మరమ్మతుల బారినపడి రెండు నెలలు దాటింది. అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో గ్రామంలో నీటి సమస్య తలెత్తింది. నీటి కోసం పొలం వద్దకు వెళ్లాల్సి వస్తోంది. కొందరు కిలోమీటరు దూరం వెళ్లి పొలంలోని బోరు బావి నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. మరికొంతమంది గత్యంతరం లేక ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న తాగు నీటి బోరులో నీటిని తోడుకోవాల్సిన దుస్థితి దాపురించింది. విద్యుత్ సరఫరా ఉన్నప్పుడు మాత్రమే పొలం వద్ద నీటిని పట్టుకునే అవకాశం ఉంటుంది. దీంతో జనం విద్యుత్ సరఫరా వచ్చేదాకి వేచి ఉండి నీటిని తెచ్చుకుంటున్నారు. దీంతో కూలి పనులకు కూడా వెళ్లలేకపోతున్నామని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు.



బోరుబావిలో నీటిని తోడుకుంటున్న దృశ్యం



మరమ్మతులకు గురైన తాగునీటి బోరు

ఎన్నాళ్లీ కష్టాలు?



బోరు మోటారు మరమ్మతులకు లోనై నీటికి ఇబ్బందులు పడుతున్నాం. ఉదయాన్నే విద్యుత్ సరఫరా ఉన్నప్పుడు వ్యవసాయ బోరుబావి వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నాం. దీంతో పగటిపూట కూలిపనులకు వెళ్లలేకపోతున్నాం. ఇంకా ఈ నీటికష్టాలు ఎన్నాళ్లో?

- శాంతమ్మ, పాలినేనివారిపల్లి



ఎవరూ పట్టించుకోవడం లేదు : జయమ్మ, పాలినేనివారిపల్లి

నీటి మోటారు కాలిపోయింది. నెలలవుతున్నా మరమ్మతులు చేయలేదు. దీంతో నీటికోసం మేం పడుతున్న బాధలు అన్నీఇన్నీకావు. రైతులు అవకాశమిస్తేనే మాకు నీరు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, నీటికష్టాలు తీర్చాలి.

వెంటనే మరమ్మతులు చేయిస్తాం - శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి

పంచాయతీ బోరు మోటారు మరమ్మతులకు లోనైన విషయం మా దృష్టికి వచ్చింది. వెంటనే మరమ్మతులు చేయించి, సమస్యను పరిష్కరిస్తాం.

బాధలతో బలవన్మరణాలు

ఉమ్మడి జిల్లాలో ఐదుగురి ఆత్మహత్య 6

పరిశ్రమలతో ఆర్థిక ప్రగతి

ఔత్సాహికులను ప్రోత్సహించండి

అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశాలు

పుట్టపర్తిటౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపన ద్వారా ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని మినీ సమావేశ భవనంలో బుధవారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం నిర్వహించారు. మొదట జిల్లా పరిశ్రమల శాఖ పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహికులను ప్రోత్సహించడానికి అధికారులు కృషి చేయాలన్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అవగాహన కల్పించి, ఉత్పత్తి, సేవారంగ పరిశ్రమల స్థాపనకు వారిని ప్రోత్సహించాలన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకోసం ముందుకొచ్చే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వివరించి, వాటిని పొందేలా చైతన్య పరచాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిశీలించి, అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి వచ్చేవారికి బ్యాంకులు తమవంతుగా సహకారం అందించాలని సూచించారు. జిల్లాలో పరిశ్రమలు, పెట్టుబడి, విద్యుత్, వడ్డీ రాయితీలకు సంబంధించిన 12 క్లెయిమ్‌లకు రూ.40 లక్షలు కలెక్టర్ మంజూరు చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ నాగరాజు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనీసహాని, ఐపీఓ సంజీవరాజు, డీపీఓ సమత, సాంఘిక సంక్షేమ శాఖాధికారి శివరంగప్రసాద్, ఎల్‌డీఎం రమణకుమార్, ఏజీఎం అనురాధ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పకడ్బందీగా చేపట్టాలి

జిల్లావ్యాప్తంగా ఫిబ్రవరి 1వ తేదీన పింఛన్ల పంపిణీ పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి బుధవారం పింఛన్లు, ప్రజాఫిర్యాదుల పరిష్కారంపై జిల్లాలోని ఆర్డీఓలు, హౌసింగ్ డీఈలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, వెలుగు ఏపీఎంలతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 1వ తేదీన ఉదయం 6 గంటకు పింఛన్ల పంపిణీని మొదలు పెట్టాలన్నారు. మధ్యాహ్నంలోపు పూర్తి చేయాలన్నారు. పర్యవేక్షణకు మండలస్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. పింఛన్ నగదును అధికారులు బ్యాంకుల నుంచి సకాలంలో తెచ్చుకుని సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, డీపీఓ సమత, జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



డీఐఈపీసీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

మాట నిలుపుకున్న సీఎం చంద్రబాబు

నేమకల్లు ఆలయ అభివృద్ధికి రూ.3.7 కోట్లు మంజూరు

బొమ్మనహాళ్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నేమకల్లు ఆంజనేయస్వామి సాక్షిగా ప్రజల సమక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీల్లో ఒక్కోటి నెరవేర్చుతున్నారని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలియజేశారు. ఈ మేరకు రాయదుర్గంలో బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పింఛన్ల పంపిణీ సందర్భంగా నేమకల్లు గ్రామానికి వచ్చినపుడు నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి ఇచ్చిన హామీ మేరకు రూ. 3.7 కోట్లు మంజూరు చేస్తూ పాలనా అనుమతులు జారీ చేయటం పట్ల చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు దేవదాయశాఖకు తాజా ఉత్తర్వులు వెలువడ్డాయని పేర్కొన్నారు. ఆలయ ప్రాకారం, గోపురం, ఇతరత్ర అభివృద్ధి పనులు చేపడతామన్నారు. త్వరితగతిన పనులు ప్రారంభించేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రూ.మూడు కోట్లతో గ్రామంలో సీసీరోడ్లు, మురుగు కాలువల ఏర్పాటు జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రం, ముఖ్యంగా రాయదుర్గం ప్రాంతం అభివృద్ధి చెందుతున్నారు.

ఎంతైనా రైతు బిడ్డ కదా..!

పొలం పనుల్లో మాజీ మంత్రి రఘువీరారెడ్డి బిజీబిజీ



పొలంలో వ్యవసాయ పనులు చేస్తున్న రఘువీరారెడ్డి

మడకశిర రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయశాఖ మంత్రిగా పనిచేసిన రఘువీరారెడ్డి స్వగ్రామం నీలకంఠాపురంలో వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. గ్రామ సమీపంలో ఉన్న సొంత పొలంలోకి వెళ్లి అక్కడ వ్యవసాయపనులు చేసి మధ్యాహ్నం అక్కడే పొలం వద్ద ఉన్న రచ్చబండపైనే కూర్చొని భోజనం తింటున్నారు. 50 ఏళ్ల కిందట రఘువీరారెడ్డి తండ్రి కావేరప్ప కూడా పొలం పనులు చేసిన అనంతరం అదే రచ్చబండపై కూర్చుని రాగిముద్ద తినేవారని స్థానికులు చెబుతున్నారు. అదేబాటలో రఘువీరారెడ్డి నడుస్తున్నారని వారు పేర్కొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా విడుదల చేస్తున్న సబ్సిడీ రుణాలకు సంబంధించి గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 30 నుంచి ఫిబ్రవరి ఏడో తేదీ వరకూ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. అర్హులైన ఆయా కేటగిరీల లబ్ధిదారులు తమ ఆధార్, రేషన్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం విద్య, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా సర్వసభ్యసమావేశం గురువారం నిర్వహించనున్నారు. జడ్పీలోని సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నారు. ప్రతి సమావేశానికి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి అన్నిశాఖల అధికారులు హాజరుకావాల్సి ఉంది. కొన్ని సర్వసభ్యసమావేశాలకు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ కానీ, పలుశాఖల అధికారులు కానీ పూర్తిస్థాయిలో హాజరుకావడం లేదు. దీంతో జడ్పీటీసీలతోపాటు, ఎమ్మెల్యేలు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అనంతపురం జిల్లాకు చెందిన అధికారులు, కలెక్టర్ ఇతర శాఖల అధికారులు వస్తున్నారు కానీ శ్రీ సత్యసాయి జిల్లా నుంచి అధికశాతం డుమ్మా కొడుతున్నారు. దీంతో సభ్యులు అడిగిన ప్రశ్నలకు జవాబు ఇచ్చే అధికారుల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. గతంలో అనేక సమావేశాల్లో ఇదే సీన్లు కనిపించాయి. దీంతో గతంలో జరిగిన సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్, పలువురు ఎమ్మెల్యేలు సైతం అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. మరి ఈ సమావేశానికైనా వస్తారో.. రారో..?

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఉన్న మాజీ సైనికులు టోల్‌ప్లాజాలో ఖాళీగా ఉన్న సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి తిమ్మప్ప తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తాడిపత్రి వద్ద ఉన్న జోడి ధర్మావరం టోల్‌ప్లాజాలో సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉండి, ఆసక్తి గల మాజీ సైనికులు తమ బయోడేటాతో కర్నూలులోని కృష్ణజ్యోత్స్న కాంప్లెక్స్‌లో ఉన్న కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు ఫోన్ : 08554-241146కు సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు అండగా వైసీపీ

పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యార్థుల ఫీజులు చెల్లించడం లేదని, వారికి వైసీపీ అండగా నిలుస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి హెచ్చరికగా ఫిబ్రవరి 5న అనంతపురం నగరంలో 'ఫీజు పోరు' కార్యక్రమం చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. ఏ ప్రభుత్వాలు మారినా కొన్ని పథకాలకు సంబంధించి బకాయిలుంటాయన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు విద్యారంగానికి సంబంధించి గత ఏడాది మార్చిలోనే రూ.708 కోట్లు విడుదల చేశామని, కానీ అదే సమయంలోనే ఎన్నికల కోడ్ రావడంతో చెల్లింపులు ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక చెల్లింపులు ఆగిపోయాయ న్నారు. ఇప్పటికే చాలా చోట్ల ఫీజుల కోసం కళాశాలల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. ఫీజు చెల్లిస్తేనే పరీక్షలకు కూర్చోబెడతామంటున్నారని, ఇప్పటికే ఉత్తీర్ణత సాధించి ఉన్నత చదువులు, ఉద్యోగాలకు ఎంపికైన వారు సర్టిఫికెట్ల కోసం కళాశాలల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారన్నారు. 11 సీట్లే వచ్చినా బలమైన ప్రతిపక్షంగా ప్రజల తరపున పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ప్రకాష్‌రెడ్డి, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, నాగన్న, రమేష్ గౌడ్, శ్రీదేవి, సాకే చంద్రశేఖర్, అమర్నాథ్‌రెడ్డి, ఓబిరెడ్డి, సైఫుల్లా బేగ్, నరసింహులు, చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీమంతుడికి.. సిరి కరువు..!

- లక్ష్మీ చెన్నకేశవస్వామి భూములు అన్యాక్రాంతం
- స్వామి సేవల పేరుతో సొంత పేర్లపై పట్టా బుక్కులు
- ఆలయ మాన్యాన్ని అమ్మేసిన మరికొందరు
- ఉత్సవాలకు అవసరమైన సొమ్ము కోసం ఇబ్బందులు
- నిర్లక్ష్యం మత్తువీడని దేవదాయశాఖ అధికారులు

> "శ్రీమంతుడైన శ్రీవారు కొందరు అక్రమార్కుల వల్ల నిరుపేదగా మారాడు. వందల ఎకరాల మాన్యం ఉన్నా నిత్య కైంకర్యాలు, ఉత్సవాలకు దాతల వద్ద చేయి చాచాల్సిన దుస్థితి. ఆలయానికి సంబంధించి భూములు, షాపింగ్ కాంప్లెక్స్ నుంచి వచ్చే ఆదాయం ఎమవుతుందో తెలియని పరిస్థితి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలా జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదీ ప్రసిద్ధిగాంచిన యాడికి శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయానికి సంబంధించిన కథాకమామిషు ..."



యాడికిలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం

యాడికి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాతిగాంచిన యాడికి శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయి. దీంతో స్వామివారి కైంకర్యాలకు దాతలపై ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది. శ్రీకృష్ణదేవరాయల కాలం నిర్మించిన ఈ పురాతన ఆలయానికి రికార్డుల ప్రకారం 250 ఎకరాలు ఉంది. గతంలోనే కొంత భూమిని వేలం ద్వారా విక్రయించగా చివరకు 152.78 ఎకరాలు మిగిలింది. ఈ భూమిని సైతం కొందరు స్వామిసేవల పేరు చెప్పి తమ సొంత పేర్లతో పట్టాదారు పాసు బుక్కులు చేసుకున్నారు. మరికొందరు ఏకంగా అమ్మేశారు. ఇంత జరుగుతున్నా దేవదాయశాఖ అధికారులు చర్యలకు పూనుకోకపోవడంతో ఆలయ భూములు తరిగిపోయి స్వామి నిరుపేదగా మారే అవకాశం ఉంది. 2016లో అప్పటి దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ గాయత్రీదేవి అన్యాక్రాంతమైన చెన్నకేశవస్వామి ఆలయ భూములను పరిశీలించారు. రికార్డులు ఎవరిపేరుతో ఉన్నాయని దేవదాయ, రెవెన్యూశాఖ అధికారులను ఆరాతీశారు. సేవల పేరుతో సాగు చేసుకుంటున్న వారిపేరుతోనే భూములు ఉన్నాయని తెలపడంతో ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవదాయశాఖ అధికారులు చెన్నకేశవస్వామి ఆలయ భూముల పరిరక్షణ దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



స్వామివారి మూలవిరాట్

ఎకరా రూ.50లక్షల నుంచి రూ.కోటి వరకు

అన్యాక్రాంతం అయిన చెన్నకేశవస్వామి ఆలయ భూముల విలువ ప్రస్తుత మార్కెట్‌లో ఎకరా రూ.50లక్షల నుంచి కోటి రూపాయల వరకు పలుకుతోంది. స్థానిక కమలపాడురోడ్డు, బుగ్గరోడ్డులో ఉన్న స్వామివారి మాన్యం భూముల ధరకు రెక్కలొచ్చాయి. ఐదేళ్ల కిందట రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మధ్యవర్తులు రంగప్రవేశం చేసి ఆలయ భూములను ఎడా పెడా క్రయ, విక్రయాలు చేసి చేతులు మార్చేశారు. ఆలయ భూముల పరిరక్షణ కోసం 2018లో అప్పటి ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆలయ ప్రాంగణంలో స్థానికులతో సమావేశం నిర్వహించారు. దీంతో ఆలయ భూములు క్రయ, విక్రయాలు చేసుకున్న వారిలో గుబులు పుట్టుకుంది. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో ఆలయ భూముల సమస్య మరుగునపడింది. ఇటీవల కాలంలో యాడికి వచ్చిన దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషునాయుడు దృష్టికి స్థానికులు ఆలయ భూముల అన్యాక్రాంతం విషయం తీసుకెళ్లారు. ఆలయ భూముల వివరాలు, స్వామివారి ఆస్తులను వెల్లడించాలని స్థానికులు కోరారు. దీనిపై ఆయన మాట్లాడుతూ ఆలయ ఈఓ మాకు సహకరించడం లేదని తెలపడం గమనార్హం.



యాడికిలో అన్యాక్రాంతమైన ఆలయ భూమి

కుంటలో ఆక్రమణలు లెక్కలేనన్ని

నాటి చెన్నకేశవస్వామి ఆలయ కోనేరు నేడు కుంటగా పిలుస్తున్నారు. అపరిశుభ్రంగా ఉన్న కుంటను 2017-2018లో నాటి ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి పూడ్చివేయించి స్థానికుల ఉపాధి కోసం వాణిజ్య దుకాణాలు ఏర్పాటు చేయించారు. వంద కుటుంబాలకు పైగా ఈ స్థలంలో బంకులు ఏర్పాటు చేసుకొని జీవనోపాధి పొందుతున్నారు. గ్రామానికి నడిబొడ్డున కుంట స్థలం ఉండటంతో చుట్టుపక్కల ఉన్నవారు కుంట స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. తరచూ ఆక్రమణలు జరుగుతున్నా దేవదాయశాఖ అధికారులు గానీ, పంచాయతీ అధికారులు గానీ ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

దాతల చందాలతో బ్రహ్మోత్సవాల నిర్వహణ

ప్రతి ఏడాది మార్చినెలలో శ్రీలక్ష్మిచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను 10రోజులపాటు వైభవంగా నిర్వహిస్తారు. వందల ఎకరాల భూమి ఉన్నప్పటికి స్వామివారి ఉత్సవాల నిర్వహణకు దాతలు ఇచ్చే చందాలపై ఆధారపడాల్సి వస్తోంది. స్వామి భూములు అనుభవిస్తున్న వారి నుంచి ఎంత కౌలు వసూలు చేస్తున్నారు. ఆలయానికి సంబంధించి నిర్మించిన గదుల నుంచి ఎంత అద్దె వసూలు చేస్తున్నారు వాటిని దేనికి వినియోగిస్తున్నారు వంటి వివరాలు ఏవీ దేవదాయశాఖ అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. అధికారికంగా ఆలయ కమిటీ ఉంటే ఆలయ అభివృద్ధిపై ఏదైనా చేయడం సాధ్యమవుతుందని స్థానికులు కోరుతున్నారు. దేవదాయశాఖ అధికారులు ప్రకటించకపోయినా కొందరు తామే ఆలయ కమిటీగా గత ఐదేళ్ల నుంచి ఉత్సవాలు నిర్వహించారు. ప్రస్తుత దేవదాయశాఖ అధికారులు చొరవచూపి ఆలయ కమిటీని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఆలయ కమిటీ ఏర్పాటుచేస్తే బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఎటువంటి ఆటంకాలు ఉండవని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



అన్యాక్రాంతంపై వివరాలు ఆరాతీస్తున్న అసిస్టెంట్ కమిషనర్ గాయత్రీదేవి(ఫైల్)

నివేదికను తయారుచేశాం

- ఆదిశేషునాయుడు, అసిస్టెంట్ కమిషనర్, దేవదాయశాఖ

ఆలయ భూముల వివరాలు, ఆస్తుల వివరాలు ఇవ్వాలని ఆలయ ఈఓకు చాలాసార్లు తెలియజేశాం. ఆయన నిర్లక్ష్యం వహిస్తున్నారు. నేను యాడికి గ్రామానికి వచ్చిన సమయంలో స్థానికులు కొన్ని సమస్యలను నా దృష్టికి తీసుకువచ్చారు. అన్నింటిపైనా నివేదికను తయారుచేస్తున్నాం. ఈ నివేదికను దేవదాయశాఖ కమిషనర్‌కు అందజేస్తాం. ఆలయ భూముల పరిరక్షణ దిశగా చర్యలు చేపడతాం.

ఉద్యోగం పేరుతో రూ.23 లక్షలకు బురిడీ

- మోసపోయిన ఉరవకొండ మహిళ

ఉరవకొండ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఉద్యోగంపై ఆశతో ఉరవకొండకు చెందిన ఓ మహిళ రూ.23లక్షలు మోసపోయింది. లబోదిబోమంటూ పట్టణ పోలీసులను ఆశ్రయించింది. సంఘటనకు సంబంధించి సీఐ మహానంది తెలిపిన మేరకు... ఉవరకొండలోని ఇందిరా నగర్‌కు చెందిన విజయలక్ష్మి అనే మహిళ ఏడో తరగతి వరకూ చదువుకుంది. ఫారెవర్ మార్కెంటింగ్ గ్రూప్ ఉత్పత్తుల వివరాలను ఫేస్‌బుక్‌లో షేర్ చేస్తే కమీషన్ వస్తుందన్న విషయాన్ని చూసింది. వెంటనే ఓ వ్యక్తి ఇలాంటివి నమ్మి మోసపోవద్దని, కావాలంటే తాను బ్యాంకులో టెలికాలర్ ఉద్యోగం ఇప్పిస్తానని, అందుకు రూ.5లక్షలు లంచం ఇవ్వాలని ఆమెకు చెప్పాడు. గత ఏడాది ఆమె రూ.4లక్షలు దాకా అతడి అకౌంట్‌కు జమ చేసింది. తర్వాత ఆమెకు అనుమానం వచ్చి డబ్బు వెనక్కు ఇవ్వాలని ఒత్తిడి చేసింది. ఆమెను నమ్మించడానికి దుండగుడు ఆర్టీజీఎస్ ద్వారా ఆమె ఖాతాలోకి రూ.లక్ష పంపాడు. దీంతో అతడిని పూర్తిగా నమ్మి, సుమారుగా రూ.23లక్షలు దాకా అతడి ఖాతాలోకి జమ చేసింది. రెండు రోజుల తర్వాత అతడి ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు హైదరాబాదుకు చెందిన అక్షయ్‌నందన్ మీద కేసు నమోదు చేశారు.

బాధలతో బలవన్మరణాలు

- ఉమ్మడి జిల్లాలో ఐదుగురి ఆత్మహత్య
- ఒంటరితనాన్ని భరించలేక ఇద్దరు..
- అప్పుల బాధతో రైతు.. మరొకరు..
- కుటుంబ కలహాలతో రెవెన్యూ ఉద్యోగి..

(న్యూస్ నెట్‌వర్క్ ఆంధ్రజ్యోతి)

అప్పులు, అనారోగ్యం, కుటుంబ సమస్యలతో ఉమ్మడి జిల్లాలో ఐదుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఒంటరితనంతో ఇద్దరు, సేద్యం గిట్టుబాటుకాక ఒకరు, అప్పులు చేసి తీర్చలేక మరొకరు, రెండో భార్యతో గొడవల కారణంగా రెవెన్యూ ఉద్యోగి బలవన్మరణాలను ఎంచుకున్నారు. ఈ ఘటనలతో బాధిత కుటుంబాలు, బంధుమిత్రుల్లో విషాదం నెలకొంది.

అప్పుల బాధతో ఇద్దరు..



రామాంజనేయులు మృతదేహం

● ఉరవకొండ మండలం ఆమిద్యాలకు చెందిన రైతు రామాంజనేయులు(39) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. రామాంజనేయులుకు రెండున్నర ఎకరాల పొలం ఉంది. వ్యవసాయం చేసుకుంటూనే, ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సేద్యం, కుటుంబ అవసరాల కోసం రూ.3 లక్షలకుపైగా అప్పు చేశాడు. వాటిని తీర్చేమార్గం లేక బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రైతుకు భార్య శ్రీలత, ఇద్దరు కుమారులు ఉన్నారు.



శంకర్ (ఫైల్)

● బత్తలపల్లి మండలం సూర్యచంద్రపురంలోని బంధువుల ఇంటికి వచ్చిన శంకర్(37) అనే వ్యక్తి ఉరి వేసుకున్నాడు. ధర్మవరం పట్టణంలోని సత్యసాయి నగర్‌కి చెందిన చెందిన శంకర్, తనకు ఆరోగ్యం బాగాలేదని, కాసేపు నిద్రపోతానని బంధువులకు చెప్పి.. గదిలోకి వెళ్లాడు. ఎంతసేపటికీ తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చి పిలిచారు. స్పందన లేకపోవడంతో తలుపులను బద్ధలుకొట్టి చూశారు. అప్పటికే ఫ్యానుకు ఉరి వేసుకుని చనిపోయాడు. మృతుడికి భార్య జ్యోతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అప్పుల బాధతోనే బలవన్మరణానికి పాల్పడినట్లు తెలిసింది.

ఒంటరితనం భరించలేక ఇద్దరు..



నోయల్ ల్యాంబ్ మృతదేహం

● గుంతకల్లు పట్టణంలోని గంట చర్చి రోడ్డు ప్రాంతానికి చెందిన నోయల్ ల్యాంబ్(35) ఉరివేసుకున్నాడు. నోయల్ రైల్వేలో ఉద్యోగం చేసేవాడు. కొన్నేళ్ల నుంచి విధులకు వెళ్లకపోవడంతో రైల్వే అధికారులు ఉద్యోగం నుంచి తొలగించారు. 2016లో పెళ్లి చేసుకున్నాడు. ఏడాదికే భార్య విడాకాలు తీసుకుంది. దీంతో అతను మద్యానికి బానిసయ్యాడు. ఇతడి కుటుంబ సభ్యులు హైదరాబాదులో ఉంటున్నారు. ఇంట్లో ఒక్కడే ఉండేవాడు. ఈ క్రమంలో ఆరోగ్యం క్షీణించడం, ఒంటరితనాన్ని భరించలేక మంగళవారం రాత్రి ఇంటి పైకప్పునకు ఉరి వేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు బుధవారం ఆ ఇంటికి వెళ్లి పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● కళ్యాణదుర్గం భట్టువాని వీధిలో రాజేష్ (38) అనే వ్యక్తి ఉరి వేసుకున్నాడు. రాజేష్ తల్లిదండ్రులు కొన్నేళ్ల కిందట చనిపోయారు. సోదరి లక్ష్మి ఉద్యోగం చేస్తూ హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. స్థానికంగా ఒంటరిగా ఉన్న రాజేష్, మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో ఉరివేసుకున్నట్లు చుట్టుపక్కల వారు గమనించి 100కు డయల్ చేశారు. పట్టణ పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో ఉద్యోగి..



లక్ష్మీపతి రెడ్డి (ఫైల్)

బుక్కరాయసముద్రం మండలం దయ్యాలకుంటపల్లి వద్ద రెవెన్యూ ఉద్యోగి లక్ష్మీపతి రెడ్డి(46) ఉరివేసుకున్నాడు. కూడేరు మండలం గొటుకూరుకు చెందిన లక్ష్మీపతిరెడ్డి కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. క్రిష్ణవేణి అనే మహిళతో 15 సంవత్సరాల క్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పదేళ్ల క్రితం క్రిష్ణవేణి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో తన అక్క కూతురు శ్రీవాణిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కూతురు పుట్టింది. వివాహం జరిగిన రెండేళ్ల తరువాత కలహాలు తలెత్తాయి. దీంతో ఆరేళ్ల నుంచి శ్రీవాణి భర్తకు దూరంగా ఉంటున్నారు. ప్రస్తుతం పెద్ద భార్య కుమారుడు, కూతురుతో కలిసి అనంతపురంలోని ద్వారాకా విల్లాస్‌లో ఉంటున్నాడు. రెండో భార్య కాపురానికి రాకపోవడంతో మంగళవారం రాత్రి ఆమె పుట్టినిల్లు దయ్యాలకుంటపల్లికి వెళ్లాడు. ఆ సమయంలో వాగ్వాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి దయ్యాలకుంటపల్లి నరసమ్మ గుడి వద్ద చెట్టుకు ఉరివేసుకున్నాడని తెలిపారు. స్థానికులు బుధవారం ఉదయం చూసి పోలీసులుకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసుకుని, వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేషగిరి తెలిపారు.

పథకాలు అమలు చేసినపుడే సత్ఫలితాలు

సమష్టిగా పీఎం, సీఎం ఆశయాలు నెరవేరుద్దాం

20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్



సమీక్షలో మాట్లాడుతున్న లంకా దినకర్

అనంతపురంటౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను సక్రమంగా అమలు చేసినపుడే సత్ఫలితాలు వస్తాయని 20సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకాదినకర్ సూచించారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం, జల్‌జీవన్, గ్రామీణ సడక్ యోజన, లక్‌పతిదీదీ, అమృత్‌పథకం, కల్యాణ్ అన్నయోజన, పీఎంసూర్యఘర్, పీఎం అవాస్‌యోజన, పీఎం విశ్వకర్మ తదితర పథకాలను పక్కాగా అమలు చేయాలన్నారు. వైసీపీ పాలనలో ఉపాధి పనులు చేయకపోయినా, చేసినట్లు దొంగబిల్లులు పెట్టి దోచుకున్నారన్నారు. అమృత్ పథకం ద్వారా మున్సిపాలిటీలకు తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకానికి సబంధించి నిధుల ఖర్చులో నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. అందరూ సమష్టిగా పని చేసి పీఎం వికసిత్ భారత్, సీఎం స్వర్ణాంధ్ర ఆశయం నెరవేరుద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో జేసీ శివనారాయణ శర్మ, డీఆర్‌ఓ మలోల, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

అనంతపురం సెంట్రల్: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానని 20 సూత్రాల కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ పేరుతో రాజకీయం చేస్తోందని విమర్శించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలి



మాట్లాడుతున్న రవిశంకర్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి ప్రస్తుత జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని ఆలిండియా ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీఓహోంలో బుధవారం ఆయన మాట్లాడుతూ కేంద్రబడ్జెట్‌లో ప్రస్తుత ఎస్సీ, ఎస్టీ జనాభా ప్రాతిపదికన రూ.12లక్షల కోట్లు కేటాయించాలన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో కేంద్రబడ్జెట్ రూ.48లక్షల కోట్లలో ఎస్సీ, ఎస్టీలకు రూ.13,500 కోట్లు మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనైనా జనాభా ప్రాతిపదికన ఎస్సీ ఎస్టీలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి పురోగతిలో భాగస్వాములను చేయాలని కోరారు. ఈ విషయంపై ఇప్పటికే కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకుడు సుగప్ప పాల్గొన్నారు.

నేటి నుంచి సౌత్‌జోన్ వెటరన్ క్రికెట్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ వెటరన్స్ క్రికెట్ పోటీలు గురువారం నుంచి ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా వెటరన్స్ క్రికెట్ సంఘం సభ్యులు తెలిపారు. ఈ పోటీల్లో ఆంధ్రా, హైదరాబాద్, తమిళనాడు జట్లు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 2 వరకు పోటీలు సాగుతాయన్నారు.

ప్రతి నెలా వ్యథే..!

శ్రీరామిరెడ్డి కార్మికులకు అందని వేతనాలు

ఆరు నెలలుగా చెల్లించని కాంట్రాక్టర్

పట్టించుకోని అధికారులు..

మరోసారి సమ్మెకు సిద్ధం!



అనంతపురం న్యూటౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వేతనం అందాలంటే సమ్మె చేయాల్సిన పరిస్థితి వచ్చిందని శ్రీరామిరెడ్డి నీటి పథకం కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలలుగా వీరికి వేతనాలు ఇవ్వడం లేదు. దీంతో కుటుంబ పోషణ భారమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ లెక్కలేనితనంతో కార్మికులు తిప్పలు పడుతున్నారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో దాదాపు 650 మంది కార్మికులు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికపై పని చేస్తున్నారు. ఈ పథకం ద్వారా కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండతో పాటు మడకశిర, హిందూపురం, అమరాపురం మండలాల పరిధిలోని దాదాపు 1050 గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. గత వారంలో అధికారులతో చర్చలు జరిపేందుకు కార్మిక నాయకులు జిల్లా కేంద్రానికి వచ్చారు. అయితే ఉన్నతాధికారులు ఇతర పనులపై క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లడంతో కార్మికులు సాయంత్రం వరకు ఎదురు చూసి వెనుతిరిగారు. అయితే జిల్లా కేంద్రంలోని ప్రధాన నాయకులతో చర్చలు జరిపి, అధికారులను సంప్రదించి వారి నుంచి స్పందన లేదంటే సమ్మె తప్పదన్న సంకేతాలు కనబడుతున్నాయి. అధికారులతో చర్చలు జరిపిన ప్రతిసారి ఒకనెల లేదా రెండు నెలల వేతనం అందజేసి మమ అనిపించడం పరిపాటిగా మారింది. దీంతో కార్మికులు మళ్లీ ఆందోళన బాట పట్టాల్సి వస్తోంది. సత్యసాయి బోర్డు పరిధిలో ఉన్న కార్మికులకు మాత్రం ఎలాంటి సమస్య తలెత్తకుండా ప్రతినెలా వేతనాలు చెల్లిస్తున్నారు. బోర్డు పరిధిలో లేకుండా కాంట్రాక్టర్ ద్వారా వేతనాలు అందుకుంటున్న వారికి మాత్రం తిప్పలు తప్పడం లేదు. దీనికి తోడు కాంట్రాక్టర్ గడువు ముగియడం. తిరిగి టెండర్లు ఖరారు చేయకపోవడం కొంత ఇబ్బందికరంగా మారింది.

సమస్యలు పరిష్కరిస్తాం: సురేష్, ఎస్ఈ



శ్రీరామిరెడ్డి నీటి పథకం కార్మికులకు సంబంధించి టెండరు గడువు పూర్తి కావడంతో కొంత వరకు వేతనాలు చెల్లించడానికి ఇబ్బందిగా ఉంది. పాత కాంట్రాక్టర్ ద్వారా అయిన చెల్లిద్దామంటే నిధులు కొరత ఉంది. టెండరు పూర్తి చేసి బకాయి వేతనాలు చెల్లించేలా ప్రయత్నం చేస్తాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతోనే కొంత ఇబ్బందిగా ఉంది. వీటిని వీలైనంత త్వరగా పరిష్కరించేలా చూస్తాం.

పాత బిల్లులు చెల్లిస్తేనే..: రామారావు, డీఈ



ప్రస్తుత కాంట్రాక్టర్ గడువు ముగిసినప్పటికి రీటెండర్ నిర్వహించి కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగించినా, పాత బకాయిలు చెల్లిస్తేనే కొత్తవారికి అప్పగించే వెసులుబాటు ఉంది. అయితే పాత వారి నుంచి వేతనాలు చెల్లించడానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేసేలా ఉన్నతాధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించేలా చూస్తాం.

మళ్లీ నష్టాలే



కల్లంలో ఎండుమిర్చిని ఆరబోసిన రైతులు.. మిర్చిని గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

రైతులకు కన్నీరు పెట్టిస్తున్న ఎండుమిర్చి

తెగుళ్లతో తగ్గిన దిగుబడులు

గిట్టుబాటు కాని ధరలు



రాయదుర్గం రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మిర్చి పంట గత రెండు, మూడేళ్ల నుంచి రైతులకు నష్టాలనే మిగులుస్తోంది. ఈ ఏడాది కూడా ఎప్పటిలానే నష్టాలే వస్తున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడిగా పెట్టి సాగుచేస్తే ఒక వైపు దిగుబడి రాక మరో వైపు మార్కెట్‌లో ధర లేక రైతులు కుదేలవుతున్నారు. ప్రస్తుతం ఉన్న ధరలతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వడ్రవన్నూరు, డీ.కొండాపురం, ఆవులదట్ల, గ్రామదట్ల, మెచ్చిరి, ఆర్‌బీవంక తదితర గ్రామాలలో బోరుబావుల కింద డబ్బీ బేడిగి, సింజెంట్ మిరప రకాలను 55 ఎకరాల్లో సాగుచేశారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో దిగుబడి ఆశాజనకంగా ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో ధరలు లేవు. ఉన్న ఫలంగా ధరలు పడిపోవడానికి తోడు కూలీల ఖర్చులు, ఎరువులు, పురుగుల మందులు ధరలు పెరగడం రైతులకు భారంగా మారింది. మిర్చి రైతు ఎకరానికి రూ. 50 వేల నుంచి రూ.1.30 లక్షల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ప్రస్తుతం పంటకోత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎకరానికి 25 నుంచి 30 క్వింటాలు రావాల్సిన దిగుబడి ఆరు క్వింటాళ్ల నుంచి 10 క్వింటాలు మాత్రమే వస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. పంటకు దోమ, నల్లితెగులు ఆశించడంతో దిగుబడి బాగా తగ్గిపోయింది. ప్రస్తుతం ఎండుమిర్చి క్వింటా రూ. 12 వేల నుంచి రూ. 20వేల వరకు పలుకుతోంది. గత రెండేళ్ల నుంచి ధరలు బాగా పడిపోయాయి. ఎండుమిర్చిని స్థానికంగా నిల్వ ఉంచలేక కర్ణాటకలోని బ్యాడిగి, గుంటూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తరలించి గోదాములలో నిల్వ ఉంచుతున్నారు. ప్రభుత్వం మద్ధతు ధర కల్పించకపోవడంతో నష్టపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పంటను నిల్వ చేసుకునేందుకు గోదాములు, రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

మూడేళ్లుగా నష్టపోతున్నాం



గత మూడేళ్ల నుంచి మిర్చిపంటను సాగుచేసి నష్టపోతున్నాం. గత ఏడాది కంటే ఈ ఏడాది ఎండుమిర్చి ధరలు పడిపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. ఎకరా మిర్చి సాగుకు రూ. లక్షకు పైగా ఖర్చు చేస్తున్నా కనీసం పెట్టుబడి కూడా దక్కడం లేదు. ఈ ఏడాది పంటకు తెగుళ్ల సోకడంతో దిగుబడి తగ్గిపోయింది.

-అశోక్, రైతు, వడ్రవన్నూరు

భారం అవుతోంది



పంటసాగు ఖర్చులు కూడా పెరగడంతో వ్యవసాయం భారమవుతోంది. నాకున్న ఆరు ఎకరాల పొలంలో మిర్చి సాగుకు దాదాపు రూ. 8 లక్షల వరకు ఖర్చుపెట్టా. పంట చేతికందిన తర్వాత అమ్మగా రూ. 2.26 లక్షలు చేతికందింది. ఖర్చులు విపరీతంగా పెరిగాయి. దిగుబడి తగ్గడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది.

-శ్రీనివాసులు, రైతు, కొండాపురం

తెగుళ్లతోనే తీవ్ర నష్టం



ఆరు ఎకరాలలో మిర్చి పంట సాగుచేశా. వాతావరణంలో మార్పులు రావడంతో పంటపై తెగుళ్ల ప్రభావం తీవ్రంగా చూపింది. వేల రూపాయలు వెచ్చించి పురుగులమందును పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోయింది. పంట పూత, కాయ దశలో ఉన్నపుడు తెగుళ్ల సోకడంతో దిగుబడి పూర్తిగా తగ్గింది. మార్కెట్‌లో ధర లేకపోవడంతో లక్షల్లో నష్టం భరించాల్సి వచ్చింది.

- రాజశేఖర్‌రెడ్డి, రైతు, గ్రామదట్ల

చిరుత దాడిలో ఆవు మృతి



ఆవు కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారి

కళ్యాణదుర్గం రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాపిరి గ్రామ సమీప పొలాల్లో గత కొన్ని రోజులుగా చిరుతల దాడిలో గొర్రెలు, పాడి పశువులు మృతి చెందుతున్నాయి. రైతు హరికృష్ణకు చెందిన ఆవు బుధవారం చిరుత దాడిలో బుధవారం మృతి చెందింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నిత్యం పశువులు, గొర్రెలపై చిరుతలు దాడి చేయడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు నిద్రమత్తు వీడి చిరుతలను బంధించాలని చాపిరి గ్రామ రైతులు కోరుతున్నారు.

100 శాతం సబ్సిడీ

పశుగ్రాసం సాగుకు ఉపాధి నిధులు

50 సెంట్ల వరకు రాయితీ వర్తింపు

కొత్తచెరువు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. ఇప్పటికే మినీ గోకులాల పథకం కింద షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. చిన్న, సన్నకారు రైతులకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పశుగ్రాసం సాగుకు ప్రభుత్వం వందశాతం రాయతీ వర్తింపజేస్తోంది. పశుపోషకులు ఆయా మండలాల్లోని పశువైద్యశాలల ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒక్కో రైతుకు గరిష్ఠంగా 50 సెంట్లలో (అర ఎకరా) పశుగ్రాసం సాగుకు పూర్తిస్థాయి సబ్సిడీ వర్తింపజేస్తోంది. దీంతో చిన్న, సన్నకారు రైతులు పశుగ్రాసం సాగుకు ముందుకు వస్తున్నారు.

వెయ్యి ఎకరాలు లక్ష్యంగా...

జిల్లావ్యాప్తంగా వెయ్యి ఎకరాల్లో పశుగ్రాసం సాగు లక్ష్యంగా నిర్దేశించారు. ఆ మేరకు యంత్రాంగం చర్యలు చేపడుతోంది. రైతులకు అవగాహన కల్పిస్తోంది. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 653 మంది రైతులు 316 ఎకరాల్లో గ్రాసం సాగుకు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. దరఖాస్తుల సమర్పణ నిరంతర ప్రక్రియ అని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. 50 సెంట్లలో గడ్డిసాగుకు కూలీల ఖర్చుల కింద రూ.15 వేలు, గడ్డి విత్తనాలకు, పుల్ల ఖర్చుల కింద రూ.17,992 అందజేస్తారు. ఈ బిల్లులను క్షేత్రస్థాయిలో డ్వామా, పశువైద్య అధికారులు పరిశీలించి, ధృవీకరించిన అనంతరం రైతులకు బిల్లులు మంజూరవుతాయి.



పశుగ్రాసం సాగు

అర్హతలు ఇవీ..

పశుగ్రాసం సాగుకు దరఖాస్తు చేసుకొనే రైతులు 5 ఎకరాల్లోపు భూమి కలిగి ఉండాలి. ఉపాధి జాబ్ కార్డు కలిగి ఉండాలి. ఆయా రైతులు స్థానిక పశువైద్యశాలలో గానీ, రైతుసేవాకేంద్రాల్లో గానీ దరఖాస్తులు చేసుకోవచ్చు. పొలానికి సంబంధించిన 1బీ, ఆధార్, రేషన్ కార్డులు, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్సు (నకలు) పత్రాలను జతచేయాల్సి ఉంటుంది. అనంతరం గ్రామసభల ద్వారా లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేస్తారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

పశుగ్రాసం సాగు పెంచే దిశగా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, మంజూరు చేస్తాం.

- శుభదాస్, జిల్లా పశువైద్యాధికారి

డిగ్రీ పరీక్షల్లో 90 శాతం పాస్



ఫలితాలను విడుదల చేస్తున్న ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు

అనంతపురం సెంట్రల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రథమ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో 90శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ సత్యలత ఆధ్వర్యంలో ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ జీవీ రమణ, సీఈ డాక్టర్ లోకేష్ ఫలితాలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ రమేష్‌బాబు మాట్లాడుతూ స్వయం ప్రతిపత్తిని సాధించిన కేఎస్ఎన్ కళాశాల అత్యుత్తమ ఫలితాలు సాధించడం హర్షణీయమని తెలిపారు. 647 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 584మంది పాస్ అయ్యారు. దీంతో పాస్‌శాతం 90.26గా నమోదనైనట్లు ప్రిన్సిపాల్ సత్యలత వివరించారు. రీవాల్యుయేషన్‌కు రూ.300, ఫిజికల్ వెరిఫికేషన్ కోసం రూ.600 చొప్పున ఫిబ్రవరి 6లోపు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సీఈ శివశంకర్‌రెడ్డి, ఈసీఈ రమణనాయుడు, అధ్యాపకులు రామలింగారెడ్డి, రామకృష్ణ, అంజనరెడ్డి, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పేరూరు'కు నిధులు ఇవ్వండి

ఆర్థిక మంత్రి కేశవ్‌కు ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్ వినతి



పయ్యావుల కేశవ్‌తో చర్చిస్తున్న పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

అనంతపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పేరూరు కాలువ నిర్మాణం, భూసేకరణకు నిధులు కేటాయించాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ విజ్ఞప్తి చేశారు. మంత్రిని అనంతపురంలోని ఆయన నివాసంలో బుధవారం కలిశారు. అంతకు మునుపు తమ నివాసంలో హంద్రీనీవా అధికారులతో సమావేశమయ్యారు. జీడిపల్లి నుంచి పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పనుల పురోగతిపై చర్చించారు. భూసేకరణ, కాలువలు, పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్ల నిర్మాణానికి అవసరమైన నిధుల వివరాలు తీసుకున్నారు. సమగ్ర సమాచారంతో మంత్రి కేశవ్‌ను కలిశారు. జీవో 59 ప్రకారం జీడిపల్లి నుంచి పేరూరు ప్రాజెక్టు వరకూ 54 కి.మీ. కాలువ తవ్వాల్సి ఉందని మంత్రికి వివరించారు. వైసీపీ పాలనలో ఈ పనులు ఒక్క అడుగూ ముందుకు పడలేదని అన్నారు. పేరూరు ప్రాజెక్టు కాలువ కోసం 266 ఎకరాల భూసేకరణకు రూ.14 కోట్లు సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారని, నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. భూసేకరణ కోసం రూ.51 కోట్లు కేటాయించాలని కోరారు. పేరూరు కాలువ పనులకు రూ.200 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. హంద్రీనీవా లైనింగ్ పనులపై రైతుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని, లైనింగ్‌కు బదులుగా కాలువ వెడల్పు చేయాలని కోరారు. లైనింగ్ తప్పదని భావిస్తే.. అడుగు భాగాన్ని వదిలేయాలని కోరారు. నసనకోట ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో జూనియర్ కాలేజీ ఏర్పాటుకు ఫైనాన్షియల్ క్లియరెన్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీఎం చంద్రబాబుతో చర్చించి, నిధుల కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. అనంతపురంలోని తనక్యాంప్ కార్యాలయంలో శ్రీసత్యసాయి జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో బుధవారం సమావేశమయ్యారు. చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాల్లో తాగునీటి అవసరాల గురించి చర్చించారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని, అవసరం మేరకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామని అధికారులు తెలిపారు. బోర్లలో నీరు తగ్గితే మరింత లోతు తవ్వుతామని, పొలాల నుంచి నీటిని సరఫరా చేసే మార్గాలను పరిశీలిస్తున్నామని వివరించారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మూడు మండలాల పరిధిలో ఇంటింటికీ తాగునీరు అందించే పథకం గురించి ఎమ్మెల్యే ఆరా తీశారు. రూ.340 కోట్లతో చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

పింఛన్‌లకు రూ.124.94 కోట్లు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఫిబ్రవరి ఒకటోతేదీ ఉదయం నుంచే పంపిణీకి ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 2,82,754 మంది పింఛన్‌దారులకు రూ.124.90 కోట్లు విడుదలయ్యాయి. పింఛన్ సొమ్మును శుక్రవారం బ్యాంకుల నుంచి సిబ్బంది డ్రా చేసుకుని శనివారం ఉదయం 6 గంటల నుంచే పంపిణీ చేయాలని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు.

హాకీ విజేత శ్రీసత్యసాయి జిల్లా జట్టు

అనంత జట్టుకు తృతీయ స్థానం

ముగిసిన రాష్ట్రస్థాయి బాలికల సబ్‌జూనియర్ హాకీ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్రస్థాయి బాలికల సబ్‌జూనియర్ హాకీ పోటీల విజేతగా శ్రీసత్యసాయి జిల్లా జట్టు నిలిచింది. మూడు రోజులుగా స్థానిక ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఫాదర్ ఫెర్రర్ 13వ ఏపీ సబ్‌జూనియర్ హాకీ బాలికల రాష్ట్రస్థాయి పోటీలు బుధవారం ముగిశాయి. మొదటి స్థానంలో శ్రీసత్యసాయి జిల్లా జట్టు, ద్వితీయ స్థానంలో కడప, తృతీయ స్థానంలో అనంతపురం జట్లు నిలిచాయి. ముఖ్య అతిథులుగా హాజరైన టీడీపీ యువ నాయకుడు పరిటాల శ్రీరామ్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల పట్ల ప్రతి విద్యార్థి ఆసక్తి పెంచుకుని, ఆటల్లో రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో హాకీ అనంతపురం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయబాబు, అనిల్ కుమార్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి సూర్యప్రకాష్, ఉపాధ్యక్షుడు హనీష్, హసీన్, టోర్నమెంట్ డైరెక్టర్లు రాజశేఖర్, సెల్వపాండ్యా, మహ్మద్‌సొహాల్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



విజేత శ్రీసత్యసాయి జిల్లా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న పరిటాల శ్రీరామ్

మేలైన యజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు


జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు

కదిరిఅర్బన్, జనవరి29(ఆంధ్రజ్యోతి): మేలైన యజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పంటల్లో యజమాన్య పద్ధతులపై బుధవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ.. రబీలో సూక్ష్మధాతు లోపాలు అధికంగా ఉంటాయన్నారు. వాటి నివారణకు ఫార్ములా-4, 19-19-19 ఎకరాకు అరకేజీ చొప్పున వేయాలన్నారు. దీంతో సూక్ష్మధాతు లోపాలు తగ్గి, వేరుశనగలో మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ఇమామేటింగ్ బెంజోయేట్ లీటరు నీటిలో 4గ్రాములు పిచికారీ చేయాలన్నారు వేరుశనగలో ఆకుపచ్చ తెగుళ్ల నివారణకు ఎక్సాకోనోజోల్ 2.మి.మీ. - టెబ్యూకోనోజోల్ 1మి.మీ. లీటరు నీటిలో కలిపి, పిచికారీ చేయాలన్నారు. వాతావరణ పరిస్థితులు తెగుళ్లకు అనులకూలంగా ఉంటే 15 రోజుల తరువాత మరోసారి పిచికారీ చేయాలని ఆయన వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు నరసింహులు, రమేష్‌నాయక్, అనిత, ఏడీఏలు సత్యనారాయణ, రామసుబ్బయ్య, క్రిష్ణయ్య, స్వయంప్రభ, క్రిష్ణమీనన్, ఏఓలు పాల్గొన్నారు.

రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో

934 క్యూసెక్కులు

బెళుగుప్ప, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 934 క్యూసెక్కులు ఉన్నట్లు బుధవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 465 క్యూసెక్కులు వెళుతున్నాయని వివరించారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీల నీరు నిల్వ వుందని వెల్లడించారు.



ఆకాశంలో వింత ఆకారం

ఆకాశంలో బుధవారం తెల్లవారుజామున వింత ఆకారం కనిపించింది. ఎరుపు వర్ణంలో ఉన్న ఆకాశంలో కాంతివంతమైన రేఖలాంటి ఆకారం కనువిందు చేసింది. ఆ వింతను చూసి జానం ఆశ్చర్యపోయారు. గంటకుపైగా కనిపించడంతో జనం మైమరచిపోయి వీక్షించారు. - బత్తలపల్లి/శెట్టూరు(ఆంధ్రజ్యోతి)

టీచర్లు వ్యక్తిగత వివరాలను సరిచూసుకోవాలి

కొత్తచెరువు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): టీచర్ల సమాచార స్టేటస్ (టీఐఎస్)లో వ్యక్తిగత వివరాలను సరిచూసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) కిష్టప్ప బుధవారం ప్రకటనలో తెలిపారు. తప్పులుంటే ఈనెల 31వ తేదీలోగా డీడీఓ (డ్రాయింగ్, డిస్‌పర్స్‌మెంట్ అధికారి) లాగిన్‌లో సరిచేసుకోవాలన్నారు. సరిచేసుకోకపోతే బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో దొర్లే తప్పిదాలకు విద్యాశాఖ అధికారులు బాధ్యులు కారని డీఈఓ వెల్లడించారు.

టమోటా కిలో రూ.13



అనంతపురం రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 13తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 525 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.9, కనిష్ఠ ధర రూ.7 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.18వేలు



అనంతపురం రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 18,650 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 6,100, సరాసరి రూ. 14వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 13 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

న్యూస్ బాక్స్

కో-ఆర్డినేటర్‌కు సన్మానం



నాగభూషణాన్ని సన్మానిస్తున్న నాయకులు

బుక్కపట్నం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాయలసీమ జోన్ సీఎం క్యాంపు కో-ఆర్డినేటర్ నాగభూషణం బుధవారం పుట్టపర్తికి విచ్చేశారు. మండల కేంద్రానికి చెందిన టీడీపీ యూత్ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, పార్టీ పరిస్థితి గురించి ఆయనకు వివరించారు. ఆయన్ను కలిసిన వారిలో మైనార్టీ నాయకుడు స్టూడియో ఫక్రుద్దీన్, ఎస్సీసెల్ యూత్ నాయకులు అంజి, అశోక్, ఫణీంద్ర, నూరి ఉన్నారు.

ఉపాధి హామీ అక్రమాలపై నిరంతర పోరాటం

పుట్టపర్తిరూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధిహామీలో జరుగుతున్న అవినీతి అక్రమాలు, గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలకు రావాల్సిన వేతన బకాయిలపై నిరంతరం పోరాటం చేస్తామని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరెప్ప పేర్కొన్నారు. బుధవారం స్థానిక సాయి ఆరామంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కౌన్సిల్ సమావేశంలో నూతన కమిటీ ఎన్నుకున్నారు. కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడిగా బాలస్వామి, ప్రధాన కార్యదర్శిగా కదిరెప్ప, గౌరవాధ్యక్షుడిగా కుళ్ళాయప్పను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆవుల చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి కేశవరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి యాదవ్ హాజరయ్యారు.



సమావేశమైన వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కౌన్సిలర్లు అంటే అంత అలుసా..!



అధికారులతో వాదిస్తున్న కౌన్సిలర్లు

పుట్టపర్తి,జనవరి 29(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ వేడుకలకు తమను ఆహ్వానించకుండా అవమానించారని, కౌన్సిలర్లు అంటే అంత అలుసా అని టీడీపీ ఫ్లోర్ లీడర్ రత్నప్పచౌదరి, వైస్ చైర్మన్ తిప్పన్న, లక్ష్మి, కౌన్సిలర్లు సూర్యాగౌడ్, చెరువు భాస్కర్, సాయిగీత ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం చైర్మన్ తుంగా ఓబుళపతి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. కౌన్సిలర్లు మాట్లాడుతూ.. పాలకవర్గం ప్రమేయం లేకుండా అధికారులు పనులు చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ ప్రహల్లాద ముసాయిదా బడ్జెట్ ప్రవేశపెట్టారు. వీధి లైట్లు వేయాలని, పారిశుధ్యపనులు చేపట్టాలని కౌన్సిలర్ సూర్యాగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాధాన్యత లేని వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కుల నిర్వహణకు బడ్జెట్ ఎందుకు కేటాయించారని నిలదీశారు. ఏటా ప్రాధాన్యత రంగాలకు అదనపు బడ్జెట్ కేటాయించాలన్నారు. 2020-25 ఆర్థిక సంవత్సరానికి ప్రారంభ నిల్వలు రూ.11.37 కోట్లు ఉండగా ఖర్చులు రూ.16.35 కోట్లు చేయనున్నట్టు కమిషనర్ వివరించారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ

ఓబుళదేవరచెరువు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకమర్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను డీఈఓ కిష్టప్ప బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులు రాస్తున్న ఎఫ్ఏ-3 పరీక్షల ను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని, ప్రతి విద్యార్థికి అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు శని, ఆదివారాల్లో ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసుకుని ఉత్తీర్ణత శాతం పెంచాలని ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌ను ఆదేశించారు. అనంతరం శ్రీవిజ్ఞాన్ సీబీఎస్ఈ పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంఈఓ సురేష్ బాబు, కరస్పాండెంట్ మస్తాన్, ఫక్రుద్దీన్, ఉపాధ్యాయులు ఉన్నారు.



పరీక్షలను పరిశీలిస్తున్న డీఈఓ కిష్టప్ప


స్వయం ఉపాధికి సబ్సిడీ రుణాలు

గాండ్లపెంట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం సబ్సిడీతో రుణాలు ఇస్తోందని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి బుధవారం ప్రకటనలో సూచించారు. ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 7వరకు ఆయా పంచాయతీలోని సచివాలయాల్లో అర్హులు రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 21 సబ్సిడీ రుణాలున్నాయని, గాండ్లపెంట ఏపీజీపీ బ్యాంక్ 11, రెక్కమాను ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ నాలుగు, స్టేట్‌బ్యాంక్ (ఏడీపీ) కదిరి ఆరు రుణాలు అందించేందుకు 50 శాతం సబ్సిడీతో రుణాలు ఇస్తాయన్నారు. అర్హులైన వారు పాస్‌ఫొటోలు, కుల, ఆదాయ, నివాస, రేషన్, ఆధార్ కార్డులో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉచిత శిక్షణ

ధర్మవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్థానిక రేగాటిపల్లి రోడ్డు పక్కనగల వివేకానంద డిగ్రీ కళాశాలలో సోలార్ పీవీసెల్ తయారీ టెక్నీషియన్‌పై అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కరణం హర్షవర్ధన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు ఇంటర్ చదివి 16 నుంచి 24 సంవత్సరాల మధ్య వయసుగల వారు అర్హులన్నారు. శిక్షణ అనంతరం ప్రభుత్వ, ప్రైవేటు సోలార్ ఎనర్జీ సంస్థల్లో ఉద్యోగాలకు అర్హులవుతారన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 6305636255, 9052984089 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పాడి పరిశ్రమకు చేయూత



మహమ్మదాబాద్ క్రాస్‌లో గోకులం షెడ్

◆ మినీగోకులాలు మంజూరు

◆ వలసలకు అడ్డుకట్ట

ఓబుళదేవరచెరువు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పాడి పరిశ్రమ దాదాపు అంతరించిపోయే దుస్థితికి చేరింది. దీంతో చాలామంది పాడి రైతులు ఉన్న పశువులను వచ్చిన కాటికి అమ్ముకొని.. పట్టణాలను కూలీలుగా వలస వెళ్లారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాడి పరిశ్రమను ఆదుకునేలా చర్యలకు శ్రీకారం చుట్టింది. పలు పథకాలతో వారిలో భరోసా కల్పిస్తోంది. పాడి పరిశ్రమ ఉత్పత్తితో పాటు పాడి రైతులకు మినీగోకులాలు మంజూరు చేసి.. వలసలకు అడ్డుకట్ట వేస్తోంది. మినీగో కులాల ఏర్పాటుకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఓడీసీ మండలానికి 28 గోకులాలు మంజూరు కాగా వాటిలో 13 నిర్మాణాలు పూర్తయింది. 15 గోకులాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. అమడగూరు మండలంలో 14 మంజూరు కాగా ఏడింటి నిర్మాణాలు పూర్తికాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. నల్లమాడ మండలానికి 34 మంజూరు కాగా 16 పూర్తి అయ్యాయి... మిగిలిన 13 వివిధ దశల్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

● పాడి పరిశ్రమకు జీవం

పాడి పరిశ్రమ అంతరించిపోతున్న తరుణంలో కూటమి ప్రభుత్వం మినీగోకులాల మంజూరుతో పాడి పరిశ్రమకు జీవం పోస్తోంది. సన్న, చిన్నకారు రైతులకు మినీ గోకులాలు ఊరట నిస్తున్నాయి. మినీ గోకులాలు నిర్మించుకోవాలంటే కనీసం రూ.మూడు లక్షలు ఖర్చవుతుంది. కూటమి ప్రభుత్వం జాతీయ ఉపాధి పథకం కింద రూ.2.30 లక్షలు మంజూరు చేస్తోంది.

● పశుగ్రాసం సాగుకు..

పాడిరైతులు పశుగ్రాసం కొరతతో ఇబ్బందులు పడకుండా చెక్ పెట్టింది. బహు వార్షిక పశుగ్రాస సాగుకు కూటమి ప్రభుత్వం ఉపాధి పథకం ద్వారా వంద శాతం సబ్సిడీతో పశుగ్రాస సాగును ప్రోత్సహిస్తోంది. పది సెంట్లు నుంచి ఎకరం వరకు సాగుకు అనుమతి ఇస్తోంది. దీంతో పాడి రైతులకు గ్రాసం కొరత తీరనుంది. ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న ప్రతి రైతు ఇందుకు అర్హుడే. జాబ్‌కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలి.



నిర్మాణ దశలో ఉన్న గోకులం షెడ్

● అర్హులు వీరే

అర్హత కలిగిన పాడిరైతులు మినీగోకులం షెడ్లు, బహువార్షిక పశుగ్రాస సాగు పొందాలంటే పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, జాబ్‌కార్డు, వన్‌బి, రేషన్‌కార్డు జిరాక్స్‌తో పాటు, సన్న, చిన్న కారు రైతులు సర్టిఫికెటుతో పొందుప రుస్తూ దరఖాస్తును సంబంధితాధికా రులకు అందచేయాల్సి ఉంటుంది.

● వలస రైతులకు ఊరట

గత వైసీపీ ప్రభుత్వ ప్రోత్సాహం లేక ఐదేళ్లలో అనేకమంది పాడి రైతులు వలస బాట పట్టారు. పశుగ్రాసం కొరతతో అనేక సంవత్సరాలుగా నమ్ము కున్న పాడి పశువులను వచ్చిన కాటికి అమ్ముకున్నారు. కాగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మినీగోకులం షెడ్లు మంజూరుతో పాటు పశుగ్రాసం పెంపకానికి సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహిస్తూ అనేక మంది పాడిరైతుల్లో ఉత్సహం.. భరోసా కల్పిస్తోంది. వలసలు వెళ్లకుండా పాడి రైతులకు ఊరట కలుగుతోంది. స్థానికంగా ఉంటూ పాడి పరిశ్రమ అభివృద్ధి చేయడానికి వారు ఆసక్తి చూపుతు న్నారు. పలువురు పాడిపరిశ్రమ వైపు మొగ్గుచూపుతున్నారు.

● మంజూరు తక్కువ

మినీగోకులం షెడ్లకు పాడిరైతుల నుంచి వందల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం మినీ గోకులం షెడ్లు తక్కువగా మంజూరు చేసింది. దీంతో అటు రాజకీయ నాయకులు, ఇటు ఉపాధి సిబ్బంది అయోమ యంలో పడ్డారు. ఈ షెడ్లను ఎవరికి కేటాయించాలో అర్థం కాగా సతమతం అవుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వం రైతుల డిమాండ్‌ను బట్టి మంజూరు శాతాన్ని పెంచాలని పలువురు కోరుతున్నారు.



భరోసా కల్పిస్తోంది

గతంలో పాడిని నమ్ముకుని జీవించే వాళ్లం. క్రమేణా పశుగ్రాసం కొరత, గత ప్రభుత్వ పాలనలో ప్రోత్సాహకం కరువు అవడటంతో పాడి పరిశ్రమను వదిలాయాల్సి వచ్చింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాడి పరిశ్రమకు జీవం పోస్తోంది. మినీషెడ్ల నిర్మాణంతో నేను తిరిగి నాలుగు పాడి ఆవులను తెచ్చుకున్నా. పాల ఉత్పత్తి ద్వారా జీవనం సాగిస్తా.

-వెంకటేష్, మారెవాండ్లపల్లి



షెడ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి (ఫైల్)

నిధులివ్వకుంటే సమస్యల పరిష్కారం ఎలా..?

అధికారులను నిలదీసిన సర్పంచ్‌లు

ధర్మవరంరూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): 'గ్రామాల్లో అనేక సమస్యలు ఉన్నాయి. ముఖ్యంగా తాగునీటి సమస్య ఉంది. బోర్ల రిపేరీ, వీధిలైట్లకు మరమ్మత్తులు చేయించాలి. డ్రైనేజీలు శుభ్రం చేయించాలి. చేతి నుంచి ఎన్నిరోజులు డబ్బులు పెట్టుకోవాలి. సమస్యలపై ప్రజలు అడుగుతుంటే ఏం సమాధానం చెప్పాలి.' అని సర్పంచ్‌లు ముత్యాలప్పనాయుడు, నాగానందరెడ్డి అధికారులను నిలదీశారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గిరక రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సర్పంచ్‌లు మాట్లాడుతూ ఉప్పునేసినపల్లి పంచాయతీలో సంవత్సరం నుంచి సత్యసాయి నీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని అన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ఎవైనా పనులు చేయాలంటే నిధులు లేవని గ్రామసెక్రటరీలు చెబుతున్నారని, అరకొరగా వచ్చే పంచాయతీ గ్రాంటుతో పారిశుధ్య కార్మికులకు జీతాలు, కరెంట్ బిల్లులకే సరిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల గ్రాంటు నుంచి నిధులు విడుదల చేస్తే ప్రజా అవసరాలను తీర్చవచ్చని కోరారు. అదేవిధంగా ఒక ఊరు నుంచి పక్క గ్రామాలకు వెళ్లాలంటే రహదారుల ఇరువైపులా వీపరీతంగా కంపచెట్లు పెరిగాయని, ప్రయాణానికి తీవ్ర ఇబ్బందిగా ఉందని అన్నారు. వేసవిలో తాగునీటి సమస్య రానీయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీడీఓ సాయిమనోహర్ స్పందిస్తూ తాగునీటి సమస్య పరిష్కారించేందుకు ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు.



అధికారులను నిలదీస్తున్న సర్పంచ్ ముత్యాలప్పనాయుడు

దుకాణాలపై అధికారుల దాడి

ధర్మవరం జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ గాంధీ నగర్, అంజుమన్ సర్కిల్‌లోని దుకాణాలపై మున్సిపల్ ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు బుధవారం దాడులు నిర్వహిం చారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యామ్సన్, కేశవ, సచివాలయ సిబ్బం ది దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి దాదాపు 70 కేజీల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. వివిధ దుకాణాదారులకు రూ.10 వేలు జరిమానా విధించారు. ఇకపై ప్లాస్టిక్ విక్రయిస్తే జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ కవర్లు

రీసర్వే ప్రక్రియ పరిశీలన

గాండ్లపెంట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమయాజులపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రీసర్వేను కదిరి ఆర్డీఓ వీవీఎస్ శర్మ బుధవారం పరిశీలించారు. రైతులు తమ భూములను సర్వే అధికారులకు చూపించి... భూముల సరిహద్దులను పక్కగా చేయించుకోవాలన్నారు. ఆయన వెంట సర్వేయర్ జిలాని, విలేజీ సర్వేయర్లు, రైతులు ఉన్నారు.

గిరిజన మహోత్సవాలను జయప్రదం చేయండి

ముదిగుబ్బ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఫిబ్రవరి 5,6 తేదీల్లో నిర్వహించే జాతీయ స్థాయి గిరిజన సాంస్కృతిక మహోత్సవాలను జయప్రదం చేయాలని ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ నాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆ మహోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఇందులో టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్, టీఎస్ఎఫ్ నాయకులు రఘునాథ నాయక్, మల్లేశ్‌నాయక్, హేమలతబాయ్, కుళ్లాయప్పనాయక్ తదితరులు పాల్గొన్నారు.

చోరీల పట్ల అప్రమత్తంగా ఉండండి

ఓబుళదేవరచెరువు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ బి. మల్లికార్జునరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని గ్రామ శివారుల్లో ఉన్న సుందరయ్య కాలనీలో ఇటీవల జరుగుతున్న చోరీలు, చైన్ స్నాచింగ్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. ప్రధానంగా ఊరు బయట ఉండే ఇళ్ల, దుకాణాదారులు జాగ్రత్తంగా ఉండాలన్నారు. మండల వ్యాప్తంగా తమ సిబ్బంది ద్వారా నోటీసులు అందించినట్లు చెప్పారు. ప్రధానంగా దుకాణదారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

● పుట్టపర్తిరూరల్ : సమాజంలో మహిళలు, బాలికలు భద్రతే లక్ష్యంగా పోలీసుశాఖ పనిచేస్తోందని పుట్టపర్తి మహిళా పోలీసుస్టేషన్ సీఐ గోపీనాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మండలపరిధిలోని వెంగళమ్మచెరువు గ్రామంలో పుట్టపర్తి రూరల్ ఎస్ఐ లింగన్నతో కలసి గ్రామ ప్రజలకు మహిళలు, బాలికలు, చిన్నారులపై నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదినారాయణరెడ్డి, గ్రామప్రజలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

ధర్మవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కండేయ స్వామి ఆలయంలో మార్గశిర మాసం బుధవారం సాయంత్రం మహాలక్ష్మీ అమ్మవారికి అమావాస్య పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి గీతావాణి, పద్మశాలియ బహుత్తమ సంఘం అధ్యక్షుడు పుత్తా రుద్రయ్య, ఉపాధ్యక్షుడు జింకా నాగభూషణం, ప్రధాన కార్యదర్శి మెడికల బాల కుళ్లాయప్ప, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

గాయపడిన ఆశావర్కర్‌కు పలువురి పరామర్శ

ధర్మవరం/రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చురామి గ్రామానికి చెందిన ఆశావర్కర్ లక్ష్మీదేవిపై అదేగ్రామానికి చెందిన వైసీపీ వర్గీయుడు పెద్దఫక్కీరప్ప కట్టెతో దాడిచేయగా చేయి విరిగిన విషయం తెల్సిందే. ధర్మవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను టీడీపీ నాయకులు మహేష్‌చౌదరి, గొట్లూరు శ్రీనివాసులు, విజయసారథి, ముచ్చురామి క్రిష్ణ, జంగం నరసింహులు, మల్లేనిపల్లి చంద్ర బుధవారం పరామర్శించారు. మంత్రి కార్యాలయ ఇన్‌చార్జి హరీష్ బాబు, పీఏ మల్లికార్జున కూడా ఆమెను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

● నిందితుడ్ని అరెస్టు చేయాలి

కురుబ కులానికి చెందిన ఆశావర్కర్ లక్ష్మీదేవిపై దాడిచేసిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాలని రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ కాటమయ్య డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో బాధితులను పరామర్శించిన అనంతరం ఆయన స్థానిక డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి డీఎస్పీ హేమంత్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆయన వెంట కురుబ సంఘం అధ్యక్షుడు బిల్లే నరేంద్ర, కురుబ సంఘం యూత్ అధ్యక్షుడు పామాల రాజశేఖర్ తుంపిరి, మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు, బిల్లే గంగాధర్, పవన్ కుమార్, వనికేరి శివ, గిరక మురళి, బిల్లే రామ కృష్ణ, ప్రవీణ్, గడేకల్ వెంకటేష్ ఉన్నారు.



ఆశావర్కర్ లక్ష్మీదేవిని పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

క్రైం న్యూస్..

చెత్తకు నిప్పు... దగ్ధమైన పంట



దగ్ధమైన నేరేడు చెట్లు

ముదిగుబ్బ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ పంచాయతీ సిబ్బంది రోడ్డు పక్కన పడేసిన చెత్త కు గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం నిప్పు పెట్టారు. అయితే ఆ మంటలు సమీపంలో వ్యవసాయ తోటలకు పాకడంతో.. నేరేడు, ఆరెకలు, కంది పంటలు దగ్ధమైనట్లు బాధిత రైతులు శ్రీనివాసులు, మౌలా, డిల్లు వాపో యారు. కాలిన పంటలను టీడీపీ మండల క్లస్టర్ తుమ్మల మనోహర్, టీడీపీ నాయకులు పరిశీలించారు. రైతులకు న్యాయం జరిగేలా విధంగా కృషి చేస్తామన్నారు.

వృద్ధురాలికి గాయాలు

ధర్మవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట సర్కిల్‌లో రైల్వేస్టేషన్ ఎదురుగా కారు ఢీకొనడంతో గూడ్‌షెడ్ కొట్టాలకు చెంది న సాకే నరసమ్మ అనే వృద్ధురాలు తీవ్రంగా గాయపడ్డారు. ఆ వృద్ధురాలు బుధవారం రైల్వేస్టేషన్ ఎదురుగా నడుచుకుంటూ వెళ్తుండగా... వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన ఆమెను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇరువర్గాల ఘర్షణ

ధర్మవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్థానిక దుర్గానగర్‌లో ఇంటి సమస్య విషయంలో ఇరువర్గాలు గొడవ పడ్డాయి. దుర్గానగర్‌కు చెందిన చంద్రాయుడు, మల్లెలరాము ఇద్దరు ఇంటి స్థల విషయంలో ఆదివారం గొడవపడ్డారు. ఈ గొడవలో చంద్రాయుడు కుమారుడు చంద్రబాబుకు తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో ఇరువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించి ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు బుధవారం తెలిపారు.

వాహనం ఢీకొని జింక మృతి

ఓబుళదేవరచెరువు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): అమడగూరు మండలంలోని గుండువారిపల్లి వద్ద కదిరి, కుంట్లపల్లి రహదారిపై బుధవారం గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ జింక మరణించింది. ఈవిషయాన్ని గ్రామస్థులు ఎస్ఐ వెంకటనారాయకు సమాచారం ఇవ్వడంతో, ఎస్ఐ పశువైద్యాధికారి ధనుజయ్‌కు సమాచారం అందించారు. ఆయన జింకకు పోస్టుమార్టం నిర్వహించి, దహన సంస్కారాలు చేశారు.

గుండెపోటుతో ఆశాకార్యకర్త మృతి

నల్లచెరువు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండ లంలోని ఎర్రగుంటపల్లిలో ఆశాకార్యకర్తగా పనిచేస్తున్న ఉమాదేవి (41) గుండెపోటుతో మరణించారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశా కార్యకర్తల సమావేశం ఉండడంతో ఉదయం ఆసుపత్రికి చేరుకుంది. ఆసుపత్రికిలోకి వెళ్లగానే ఒక్కసారిగా ఆమె కుప్పకూలిపోయింది. వెంటనే అక్కడున్న డాక్టర్ కల్పన పరిశీలించగా అప్పటికే ఆమె మరణించినట్లు తెలిపారు. ఉమాదేవికి భర్త శ్రీనివాసులు, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



ఉమాదేవి (ఫైల్)

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

తాడిమర్రి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు ఆశించిందని, సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకోవాలని రైతులకు ఏఓ రమాదేవి సూచించారు. మండలంలోని నారసింపల్లి గ్రామ సమీపంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పురుగు ఉనికిని తెలుసుకోవడానికి ఎకరానికి 4-5 విషపు ఎరలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తద్వారా ఉధృతిని బట్టి థయోడికార్బ్ ఒక గ్రామును.. లీటరు నీటికి లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 60 ఎంఎల్ లేదా కొరాజెన్ 60 ఎంఎల్ ఎకరాకు పిచికారి చేయాలన్నారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఒక కేజీ తవుడులో 250 గ్రాములు బెల్లం కలిపి అందులో 150 గ్రాముల థయోడికార్బ్ పురుగుల మందు కలిపి.. ఆ మిశ్రమాన్ని గోలీల సైజులో ఉండలుగా చేసి సాయంత్రం వేళల్లో పొలంలో వేయాలన్నారు.

న్యూస్ బాక్స్

ఘనంగా పురందరదాస ఆరాధనోత్సవం



పురందరదాస వేషధారణలో సంకీర్తన చేస్తున్న భక్తులు

పెనుకొండ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వాగ్గేయకారుడు భక్త పురందరదాస ఆరాధనోత్సవాలను బుధవారం స్థానిక మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం మఠంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, తీర్థప్రసాద వినియోగం గావించారు. అనంతరం భక్తమండలి సభ్యులు, పురందరదాస కీర్తనలు ఆలపిస్తూ పట్టణంలో నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో పాలూరిక్రిష్ణమూర్తి, భక్తబృందం, ప్రజలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

గోరంట్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ మీడియట్ మొదటి, రెండవసంవత్సరం పరీక్షలకు ఫీజు చెల్లించని విద్యార్థులకు చివరి అవకాశాన్ని మరో రెండురోజులు పొడిగించారని గోరంట్ల ఎస్ఎపిఎస్ ఎయిడెడ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యనారాయణ బుధవారం ఓప్రకటనలో తెలిపారు. పరీక్ష పీజు చెల్లించనివారు ఫీజు రూ. ఆరువందలతో అపరాధ రుసుం రూ.మూడువేలు కలిపి చెల్లించాలన్నారు. ఈనెల 31లోపు సంబంధిత కళాశాలలో ఫీజు చెల్లించి పరీక్షలు రాయవచ్చన్నారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నైపుణ్యాభివృద్ధిపై విద్యార్థులకు అవగాహన

గోరంట్ల, జనవరి29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎఎన్కె డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా లభించే అవకాశాలపై బుధవారం అవగాహన కల్పించారు. డిగ్రీతోపాటు ఆర్టిఫిషియల్, ఇంటిలిజన్స్, ఫండమెంటల్స్, కోర్సులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి చైతన్య తెలిపారు. శిక్షణ పొందినవారికి ఉచితంగా ధృవపత్రాలు అందచేస్తామని, పోటీ ప్రపంచలో జీవనోపాధి కోసం ఎలా ముందుకెళ్లాలో వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కెంపూల లక్ష్మీనారాయణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సూర్యనారాయణ, అధ్యాపకులు రమేష్, రామాంజనేయులు, విద్యార్థులున్నారు.

ట్రాన్స్‌కో సమస్యను పరిష్కరించిన అధికారులు

సోమందేపల్లి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మండ్లి గ్రామంలో వివాదాస్పదంగా మారిన ట్రాన్స్‌కో టవర్ల ఏర్పాటు సమస్యను ఎట్టకేలకు బుధవారం అధికారులు పరిష్కరించారు. బానుకోట నుంచి సోమందేపల్లి మండలం ఈదులబళాపురం సబ్‌స్టేషన్‌కు 220కేవీ విద్యుత్‌లైన్ వేయడానికి ట్రాన్స్‌కో పనులను చేపట్టింది. ఈ క్రమంలో మండ్లి రైతు జక్కా రామాంజినేయులు తన పొలంలో టవర్లు ఏర్పాటు చేయకూడదని అడ్డు తగిలాడు. రైతు ససేమిరా అనడంతో ట్రాన్స్‌కో అధికారులకు తలనొప్పిగా మారింది. పనులు పెండింగ్‌లో పడటంతో కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. ఈ క్రమంలో రైతును ఒప్పించేందుకు ఆర్డీఓ ఆనంద్‌కుమార్, సోమందేపల్లి తహసీల్దార్‌కు ఆదేశాలు జారీచేశారు. సోమందేపల్లి తహసీల్దార్ రెడ్డిశేఖర్, ట్రాన్స్‌కో ఏడీఏ ఉమామహేశ్వర్‌రావు, పోలీసుల సహాయంతో ఘటనాస్థలానికి వెళ్లి రైతుతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు.

కంది పంటకు నిప్పు..



కాలిపోతున్న కందిపంట

లేపాక్షి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించిన కందిపంటచేనులోనే నిప్పంటుకుని కాలి బూడిదైన సంఘటన బుధవారం చోళసముద్రం వద్ద చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు చోళసముద్రం గ్రామానికి చెందిన నరసింహమూర్తికి జాతీయరహదారి పక్కన టోల్‌గేట్ వద్ద 1.47ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో కందిపంటను సాగుచేశారు. పంటబాగా పండి చేతికి వచ్చే సమయంలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో మంటలు వ్యాపించి కందిపంటను మంటలు చుట్టుముట్టాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకునేలోపే పంట పూర్తిగా అగ్నికి ఆహుతైంది. అధికారులు స్పందించి రైతు ను ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

పత్తికుంటపల్లి చెరువు వేలం

సోమందేపల్లి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిదడకల పంచాయతీ పత్తికుంటపల్లి చెరువును అధికారులు బుధవారం వేలం వేశారు. సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి కేశవమూర్తి ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. సర్కారువారిపాట రూ.50వేలుకాగా వేలందారుల్లో పోటీ నెలకొంది. టీడీపీ నాయకులు ఎన్. రామచంద్ర రూ.1.40 లక్షలకు చెరువు వేలంను దక్కించుకున్నారు. వేలంపాటలో రామచంద్ర, రామాంజినేయులు, గంగరాజు, సోమశేఖర్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించండి



రాష్ట్రపతికి పంపే లేఖలను చూపుతున్న అంగన్‌వాడీలు

పెనుకొండ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అంగనవాడీలకు, హెల్పర్లకు నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్రపతి ద్రౌపదిముర్మకు లేఖ పంపనున్నట్లు సీఐటీయు నాయకుడు రమేష్, బాబావలి తెలిపారు. బుధవారం పట్టణంలోని అంగనవాడీ కార్యాలయంలో సెక్టర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు వడ్డీతో సహా గ్రాట్యూటీ చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వేతనాలు అమలు చేయాలని, ఐసీడీఎస్‌కు నిధులు కేటాయించాలని కోరుతూ రాష్ట్రపతికి లేఖలు పంపిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి బావమ్మ, మాబున్నీసా, సావిత్రమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

టెన్షన్.. టెన్షన్!

- బోగస్ పింఛన్‌దారుల్లో భయం
- వైసీపీ హయాంలో వందలాది బోగస్‌లు
- ముగిసిన మొదటి విడత వెరిఫికేషన్
- 383 మందికిగాను 329 మాత్రమే హాజరు



వెరిఫికేషన్ చేస్తున్న అధికారులు

హిందూపురం అర్బన్, జనవరి29(ఆంధ్రజ్యోతి): అడ్డదారిలో సామాజిక పింఛన్‌లు పొందుతున్న నకిలీ లబ్ధిదారుల గుండెల్లో టెన్షన్ మొదలైంది. లబ్ధిదారుల్లో అర్హులెవరు? అనర్హులెవరనే విషయాన్ని తేల్చాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీచేసిన విషయం విదితమే. అర్హత లేకున్నా అడ్డదారుల్లో లబ్ధిపొందుతున్న వారిని ఏరివేసి వారికి ప్రభుత్వం నుంచి అందే పింఛన్‌లు కట్ చేయాలని ఆదేశాలు రావడంతో లబ్ధిదారుల వెరిఫికేషన్ నిర్వహించారు.

ప్రస్తుతం దివ్యాంగులు, అంధులు, వితంతువులు, వృద్ధులకు పింఛన్లు ఇస్తున్నారు. గత వైసీపీ హయాంలో ఒక్క హిందూపురం నియోజక వర్గం



రీ వెరిఫికేషన్‌కు హాజరైన పింఛన్‌దారులు

లోనే 500లకు పైబడి నకిలీ పింఛన్‌లు మంజూరు చేయించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ నాయకులు వారి పలుకుబడి, అధికారం అస్త్రంగా ప్రయోగించి వారి బంధుమిత్రులకు, కావలసిన వారికి అడ్డదారుల్లో పింఛన్ అందేలా చేశారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఏ మాత్రం అర్హత లేని వారు సైతం పింఛన్‌లు తీసుకుంటున్నారని, తాము అన్ని విధాల అర్హులైనా తమకెందుకు ఇవ్వరని ఇటీవల గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అంతేకాకుండా దీనిపై కొత్త కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యేలకు ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో సంబంధిత కలెక్టర్‌లకు నకిలీ పింఛన్‌లను ఏరివేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. ఇంకేముంది. ఆయా విభాగాల అధికారులు నకిలీల వేట మొదలు పెట్టారు. దీంతో అనర్హుల్లో టెన్షన్ మొదలైంది. వీరందరూ ఆయా వార్డులోని అధికార పార్టీ కౌన్సిలర్‌లు, నాయకుల వద్దకు పరుగులు పెడుతున్నారు. ఎలాగైనా తమ పింఛన్‌లు పోకుండా చూడాలని వేడుకోళ్లు ప్రారంభించారు.

జిల్లా వ్యాప్తంగా హిందూపురం, కదిరిలలో ఈ నెల 18వ తేదీ నుంచి వెరిఫికేషన్ జరుగుతోంది. ఇటీవల హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో కంటికి, చెవికి సంబంధించి రుగ్మతలున్న పింఛన్‌దారులను వెరిఫై చేస్తున్నారు. ఇందుకోసం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రితో సంబంధం లేని బయటి డాక్టర్‌లను వెరిఫికేషన్ అధికారులుగా నియమించారు. ఈ తతంగమంతా డీఆర్‌డీఏ నేతృత్వంలో జరుగుతోంది. ఇప్పటివరకూ 383 మంది లబ్ధిదారులకు వెరిఫికేషన్ క్యాంపుకు హాజరుకావాలని నోటీసులు పంపగా, వారిలో 329 మంది మాత్రమే హాజరయ్యారు. మిగతావారు ఎందుకు రాలేదో తెలియదు. బుధవారంతో ఈ వెరిఫికేషన్ పూర్తయింది. పింఛన్ పొందుతున్న వారందరినీ పరిశీలించిన డాక్టర్లు ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తారు. మరి అందులో ఎంత మందిని అనర్హులుగా ప్రకటిస్తారో తెలియదు. ఏది ఏమైనా నకిలీ పింఛన్ దారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

పకడ్బందీగా రీ వెరిఫికేషన్ చేస్తున్నాం



హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో కంటికి, చెవికి సం బంధించిన రుగ్మతలున్న పింఛన్‌దారులను పరిశీలిస్తున్నారు. ఇందుకోసం మడకశిర, పెనుకొండ ఆసుపత్రుల నుంచి ప్రత్యేకంగా ఇద్దరు వైద్యులను నియమించారు. పకడ్బందీగా రీ వెరిఫికేషన్‌చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతారు. అక్కడ పర్సెంటేజీల ఆధారంగా పింఛన్‌దారులను ఎంపిక చేస్తారు.

డాక్టర్ లింగన్న, సూపరింటెండెంట్

మట్టి అక్రమంగా తరలిస్తున్న వాహనాల సీజ్



పోలీసులు సీజ్‌చేసిన ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లు

పరిగి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జయమంగళి నదిలో మంగళవారం రాత్రి మట్టి అక్రమంగా తరలిస్తున్న వాహనాలను సీజ్ చేశామని ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపారు.. మండల కేంద్రంలోని సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయం సమీపంలో జయమంగళి నది నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న ఎక్సకవేటర్, టిప్పర్లను స్థానికుల సమాచారం మేరకు పోలీస్ సిబ్బంది స్టేషన్‌కు తరలించారని ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపారు. అనంతరం రెవెన్యూకు అప్పగించామన్నారు.

ఇసుక తరలింపునకు అనుమతి పొందకుండా మంగళవారం రాత్రి నేతులపల్లి గ్రామ సమీపంలో జయమంగళి నది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బోరెడ్డిపల్లి, నేతలపల్లి రైతులు అడ్డుకున్నారు. హిందూపురం మండలం ముద్దిరెడ్డిపల్లికి చెందిన రామాంజి ట్రాక్టర్ అక్రమంగా ఇసుక తరలిస్తుండగా రైతులు కాపుకాచి అడ్డుకోగా వారి మధ్య వాగ్వాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదుచేశారు.

ఆసుపత్రి ముంగిట దుర్వాసన



కాలువల్లో పేరుకుపోయిన మురుగునీరు

పెనుకొండ టౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రి ముంగిట భరించలేని దుర్వాసనతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఆసుపత్రికి ఏదైనా రోగానికి చికిత్సకు వస్తే మరోరోగం అంటించుకోవాల్సి వస్తుందంటున్నారు. పెనుకొండ డివిజన్ కేంద్రంలో ఉన్న ఈ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతిరోజూ దాదాపు 400 మంది రోగులు, గర్భిణీలు, బాలింతలు, రోడ్డు ప్రమాద బాధితులు చికిత్స పొందుతుంటారు. ఈ క్రమంలో వీరిని పరామర్శించేందుకు వచ్చే ప్రజలు ముక్కుమూసుకుని ఆసుపత్రిలోకి వచ్చే పరిస్థితి నెలకొంది. ఆసుపత్రి ముందు భాగంలో ఉన్న మురుగు కాలువ శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. చుట్టుపక్కల ఉన్న హోటళ్ల నీరు చేరడంతోనే ఈ వాసన వస్తోందని అంటున్నారు. ఈ విషయంపై మునిసిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తానని హామీ ఇచ్చారు.

మండల సమావేశానికి అధికారుల డుమ్మా

అమరాపురం మండల సమావేశంలో సభ్యుల ధ్వజం

అమరాపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగినసర్వసభ్య సమావేశానికి పలువురుఅధికారులు డుమ్మా కొట్టడంతో సభ్యులు మండిపడ్డారు. ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన ఎంపీడీఓ రామారావు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, ఈఓఆర్‌డీ నాగముని, ఆర్‌ఐ విన్సెంట్‌పాల్, ఏపీఎం ముత్యాలప్ప, ఎంఈఓ వెంకటరమణనాయక్ పాల్గొన్నారు.

ఈసందర్భంగా ఎంపీటీసీలు హనుమంతరాయప్ప, కెంచప్ప, కోఆప్షన్ మెంబర్ రసూల్‌బాషా, నాగభూషణలు మాట్లాడుతూ అధికారులు రాకుండా సమావేశం నిర్వహించడం ఎందుకు అని ప్రశ్నించారు. అనంతరం వ్యవసాయ శాఖ తరఫున రబీ సీజన్‌లో పంటలకు ఇన్సూరెన్స్ తదితర కార్యక్రమాలపై వివరించారు. గత ప్రభుత్వంలో రైతులకు ఇచ్చిన రైతు భరోసా వంటి సంక్షేమ పథకాలు ఏమయ్యాయని కూటమి ప్రభుత్వం రైతులకు ఏమి చేసిందని ఎంపీటీసీలు, హనుమంతరాయ, నారాయణప్పలు ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకంపై ఏపీఓ జగదీష్ మాట్లాడుతూ మండలవ్యాప్తంగా ప్రతి పంచాయతీకి 20 ఫారంఫండ్‌లను మంజూరు చేసినట్లు, దీని ద్వారా భూగర్భ జలమట్టం పెరగడానికి అవకాశం ఉందని, ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధి హామీ కూలీలు చేసిన పనులకు సక్రమంగా కొలతలు తీసుకొనే విధంగా కృషి చేయాలని కోఆప్షన్ మెంబర్ రసూల్‌బాష తెలిపారు.

వెలుగుశాఖ తరఫున ఏపీఎం ముత్యాలప్ప మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంఘాలకు అందిస్తున్న రుణాలతోపాటు టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్ శిక్షణపై వివరించారు. బుక్ కీపర్లకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన వివరించారు. వీరాపురం గ్రామంలో మహిళా సంఘాలలో డబ్బులు స్వాహా జరిగినట్లు దీనిపై వివరణ ఇవ్వాలని సభ్యులు డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖ తరఫున ఏఈ సిద్దేశ్వర మాట్లాడుతూ మండలంలో లోఓల్టేజీ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. పీఎం సూర్యాఘర్, పీఎం కుసుమా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. ఎంపీపీ ఈరన్న మాట్లాడుతూ మండలంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సభ్యులు వివరించారు. ఈసందర్భంగా ఎంపీటీసీ నారాయణ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రతి పాఠశాలలో నెల కొక రోజు పాఠశాలలోనే విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి ప్రతి విద్యార్థి ప్రగతిని పరిశీలించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆర్థికాభివృద్ధి

గుడిబండ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయసాగుతోనే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని గుడిబండ కెనరాబ్యాంకు మేనేజర్ మల్లయ్య, ఏఓ వీరనరేష్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామ్మోహన్, ఏరియా కోఆర్డినేటర్ నాగరాజులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కరికెర గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు బోరుబావుల కింద లాభదాయకమైన పంటలను సాగుచేయాలన్నారు. రైతుల అభివృద్ధి కోసం బ్యాంకుల ద్వారా రుణాలు అందించి వారి అభివృద్ధికి విరివిగా రుణాలు అందిస్తామన్నారు. బ్యాంకుల్లో రుణాలు తీసుకొన్న రైతులు పాడి ఆవులను కొనుగోలు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మేనేజర్ సూచించారు. అనంతరం వ్యవసాయ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఏపీఎం రమణప్ప, తిప్పన్న, రమేష్, టెక్నికల్ అసిస్టెంట్ తిరుమల గౌడ్, సీసీ దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణానికి దరఖాస్తుల ఆహ్వానం

పెనుకొండ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పెనుకొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఈడిగ కులస్థులకు రూరల్ పరిధిలో రిజర్వ్ అయిన మద్యం దుకాణానికి ఫిబ్రవరి 5లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు తెలిపారు. ఆసక్తి కలిగినవారు దరఖాస్తు రుసుము రూ.2లక్షలు నాన్ రిఫండబుల్ రుసుము చెల్లించి దరఖాస్తు సమర్పించుకోవచ్చన్నారు. ఫిబ్రవరి 7న పుట్టపర్తిలో వేలంపాట జరుగుతుందన్నారు.

డ్రైనేజీ మరమ్మతులు పూర్తిచేయండి



డ్రైనేజీ వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పెనుకొండ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేటలో రెండు నెలల క్రితం డ్రైనేజీని ఆక్రమించుకుని నిర్మించిన అక్రమ కట్టడాలను నగర పంచాయతీ అధికారులు తొలగించారు. ఎన్నిరోజులైనా డ్రైనేజీ పనులు పూర్తిచేయకుండా అసంపూర్తిగా వదిలేయడంతో అది ప్రమాదకరంగా మారింది. అందులో పడి ఇప్పటికే పలువురు గాయాలపాలయ్యారు. వెంటనే డ్రైనేజీ పనులు పూర్తిచేయాలని కోరుతూ బుధవారం సీపీఎం నాయకులు రమేష్ ఆధ్వర్యంలో నాయకులు నిరసన తెలిపారు. మురుగునీరు నిలువ ఉండి దోమలు విజృంభిస్తున్నాయన్నారు. వెంటనే నిర్మాణ పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హరి, బాబావలి, మహబూబ్‌బాష, నరసింహ, రాజారాం, హిందూ ముస్లిం ఐక్యవేదిక రియాజ్ పాల్గొన్నారు.

రైతుల భూమి కబ్జా.. అవాస్తవం

- గ్లోబల్ ట్రస్ట్ చైర్ పర్సన్ శిల్ప

పెనుకొండ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పెనుకొండ మండలం వెంకటరెడ్డిపల్లి సమీపంలో 22సంవత్సరాల క్రితం భూములు కొనుగోలుచేసి వ్యవసాయం చేస్తూ ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్నామని, వెంకటరెడ్డిపల్లికి చెందిన ఇద్దరు ముగ్గురు రైతులు 22ఏళ్ల తరువాత వచ్చి అందులో తమ భూమిని కబ్జా చేశామని చెప్పడం అవాస్తవమని గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప పేర్కొన్నారు. బుధవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేస్తూ భూమి కబ్జా చేయాల్సిన అవసరం ట్రస్ట్‌కు లేదన్నారు. షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ ఏర్పడిన తరువాత ప్రజాసేవే లక్ష్యంగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యతనిచ్చామన్నారు. కరువు ప్రాంతంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. వేసవి కాలంలో పశుగ్రాస శిబిరాలు ఏర్పాటుచేసి పశువులకు గ్రాసం, రైతులకు ఉచిత భోజనం కల్పించామన్నారు. మండల వ్యాప్తంగా ఎన్నో బోర్లువేసి వాటర్‌ప్లాంట్‌లు ఏర్పాటుచేసి ప్రజల దాహార్తిని తీర్చామన్నారు. నవ్యశ్రీ ఉచిత కంటి ఆసుపత్రి నెలకొల్పి లక్షలాది మందికి నేత్రదానం చేశామన్నారు. నవ్యశ్రీ ఉచిత ఆసుపత్రిని నెలకొల్పి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. కరోనా సమయంలో లక్షలాది రూపాయలు విరాళంగా అందించినట్లు గుర్తుచేశారు. గ్లోబల్ ట్రస్ట్ సమాజానికి సేవ చేస్తుంది తప్ప ఎలాంటి అవినీతి పనులకుగాని, భూకబ్జాకు పాల్పడదని ఆ అవసరం ట్రస్ట్‌కు లేదన్నారు. తమ భూమికి సంబంధించిన పూర్తి వివరాలను రెవెన్యూ అధికారులకు ఇచ్చామన్నారు.

నరసంబూదిలో పొలం పిలుస్తోంది



నరసంబూదిలో పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

అగళి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసంబూది, రావుడి గ్రామ పంచాయతీలో బుధవారం "'పొలంపిలుస్తుంది' కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధికారి శేఖర్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ప్రతి రైతు రబీలో సాగుచేసిన పంటలకు ఈ క్రాప్ నమోదుచేసుకోవాలని సూచించారు. ఆధునీకరణ యాంత్రీకరణ పథకంలో భాగంగా డ్రోన్ పరికరం ఇస్తామన్నారు. డ్రోన్ ధర రూ.10లక్షలు కాగా ప్రభుత్వం రూ.8లక్షలు, సబ్సిడీ రైతు వాటాకింద రూ.2లక్షలు చెల్లిస్తే సీహెచ్‌సీ గ్రూపుకు ఇస్తామన్నారు. పంటలపై వచ్చే చీడపీడల నివారణ, సలహాలు, సూచనల కోసం ఎప్పటికప్పుడు రైతు సేవ కేంద్రం అధికారిని సంప్రదించాలన్నారు. రైతులకు ప్రభుత్వం గుర్తింపుకార్డు కూడా జారీచేస్తుందన్నారు. ప్రతి రైతు సేవా కేంద్రానికి వెళ్లి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం రాగులను క్వింటాల్‌కు రూ.4290 వంతున కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీ ఈఓ ప్రశాంత్ రైతులు రామన్న, బసవరాజ్ పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయం పాటించరా?



10.30 గంటలైనా తెరుచుకోని సచివాలయ తలుపులు

పరిగి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీరంగరాజులపల్లి గ్రామ సచివాలయం బుధవారం 10.30 గంటలు దాటినా తలుపులు తెరవకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలు తీర్చేందుకు గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయాలను ప్రభుత్వం ఏర్పాటుచేసి ఒక్కో సచివాలయంలో ఆరు నుంచి పది మంది ఉద్యోగులను నియమిస్తే ఉద్యోగులు మాత్రం వారికి ఇష్టమొచ్చినట్లు కార్యాలయానికి వచ్చి సమయం మించకుండానే తాళం వేసి వెళ్లిపోతురని, స్థానిక ప్రజలు సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ శ్రీధర్‌ను వివరణ కోరగా పలు ప్రభుత్వ సర్వేల కారణంగా సచివాలయ సిబ్బంది గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

క్రైం కార్నర్

పేకాటరాయుళ్ల అరెస్ట్.. రూ.30వేలు స్వాధీనం

పెనుకొండ రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రొద్దం మండలం బొక్సంపల్లి సమీపంలో పేకాట ఆడుతున్న ఇద్దరిని అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.30వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు రొద్దం ఎస్‌ఐ నరేంద్ర బుధవారం తెలిపారు. బొక్సంపల్లి నుంచి కోగిరకు వెళ్లే అటవీప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి ఆ స్థావరంపై దాడిచేశామన్నారు. దాడుల్లో ఇద్దరు పట్టుబడ్డారన్నారు. మిగిలిన తొమ్మిది మంది పరారైనట్లు తెలిపారు. వారినుంచి నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుకొన్న మద్యాన్ని చూపుతున్న పోలీసులు

అమరాపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని హాలుకూరు గ్రామంలో కర్ణాటక మద్యం అమ్ముతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌లో హాజరుపర్చినట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాదరావు తెలిపారు. పాపన్న అనే వ్యక్తి వద్ద 20 మద్యం ప్యాకెట్లను, శశికుమార్ అనే వ్యక్తి వద్ద 20 మద్యం ప్యాకెట్లను, ప్రహ్లాద్ అనే వ్యక్తి వద్ద 25 కర్ణాటక మద్యం ప్యాకెట్లను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొన్నట్లు సీఐ తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో తాపీ మేస్త్రీకి గాయాలు



చికిత్స పొందుతున్న అంజినప్ప

పెనుకొండ రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రొద్దం మండలం ఎల్‌జీబీ నగర్‌లో విద్యుత్ షాక్‌కు గురై అంజినప్ప అనే తాపీ మేస్త్రీ తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రొద్దం మండలం భూచర్ల గ్రామానికి చెందిన అంజినప్ప బుధవారం ఎల్‌జీబి నగర్‌లో హనుమంతరాయుడుకు చెందిన ఇంటి పని చేస్తుండగా ప్రమాదవశాత్తు ఇంటిపైనున్న 11కేవీ విద్యుత్ తీగలు మెడకు తగలడంతో షాక్‌కు గురై పై నుంచి కిందకు పడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అంజినప్పను స్థానికులు పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

మడకశిరటౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మడకశిర నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం నగర పంచాయతీ సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు కమీషనర్ రంగస్వామి తెలిపారు. ఈసమావేశాన్ని ఉదయం 10.30 గంటలకు ఏర్పాటు చేశామని, పంచాయతీ అధికారులు, కౌన్సిలర్లు, కోఆప్షన్‌మెంబర్లు హాజరుకావాలని కోరారు.